ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



సంక్షేమానికి ప్రాధాన్యం



కార్మికులతో మాట్లాడుతున్న మంత్రులు తుమ్మల, శ్రీధర్‌బాబు, పొన్నం

- రూ.34 కోట్లతో నేతన్నలకు రూ.లక్ష రుణమాఫీ
- రైతులకు రూ.33వేల కోట్ల రుణమాఫీ
- సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు రూ.914 కోట్ల బకాయిలు విడుదల
- వర్కర్ టు ఓనర్, అపెరల్ పార్కు కార్యక్రమాలు కొనసాగిస్తాం
- చేనేత జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు
- సిరిసిల్ల అపెరల్ పార్కులో ముగ్గురు మంత్రులతో టెక్స్‌పోర్టు యూనిట్ ప్రారంభోత్సవం
- యూనిట్‌లో ఉద్యోగులకు అపాయింట్‌మెంట్ లెటర్ల అందజేత

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

రాజన్న సన్నిధిలో మంచి కార్యక్రమాలకు కాంగ్రెస్ ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని, నేతన్న లు, రైతన్నల సంక్షేమం ప్రాధాన్యతగా ప్రభుత్వం పాలన సాగిస్తోందని చేనేత, జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అన్నారు. శుక్రవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో అపెరల్ పార్కులో రూ.62కోట్లతో ఏర్పాటు చేసిన టెక్స్ పోర్టు గార్మెంట్ యూనిట్‌ను పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు, బీసీ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ లతో కలిసి ప్రారంభించారు. యూనిట్‌లో పని చేస్తున్న మహిళా కార్మికులతో మంత్రులు ముచ్చటించారు. వారికి లభించే ఉపాధి, పను లు, సౌకర్యాలపై అడిగితెలుసుకున్నారు. మంత్రు లను టెక్స్‌టైల్ ముఖ్యకార్యదర్శి శైలజ రామ య్యార్ స్వాగతించారు.

అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో తుమ్మల మాట్లాడుతూ నేతన్నల స్థితిగతులు మెరుగుపరిచే దిశగా వర్కర్ టు ఓనర్ పథకం, అపెరల్ పార్కుల్లో జీవనోపాధి కల్పించే దిశగా కార్య క్రమాలను ముందుకు తీసుకవెళతామని తెలిపా రు. మౌలిక సదుపాయాలను కల్పిస్తామన్నారు. తెలంగా ణ కష్టాలు, వెనక బాటు తనంగానే గతంలో విధ్వం స పరిపాలన కొనసాగిందన్నారు. వాటిని దృష్టిలో పెట్టుకొని రైతన్నల, నేతన్నల సంక్షేమంగా మౌలిక వసతులు కల్పిస్తూ యువ తకు అవకాశాలు కల్పించే దిశగా ప్రభుత్వం పని చేస్తోందన్నారు. దేశ చరిత్ర లోనే ఒకేసారి రైతాంగానికి రూ.33వేల కోట్లు రుణ మాఫీ చేసిన ఏకైక తెలంగాణ ప్రభుత్వమ న్నారు. కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి సందర్భంగా నేతన్నలకు రూ.34వేల కోట్ల రుణమాఫీ పూర్తి చేశామన్నారు. సిరిసిల్ల నేతన్నలకు పెండింగ్‌లో ఉన్న రూ.914 కోట్ల బకాయిలు అందించామన్నారు. చేనేత భరోసా, చేనేత బీమా, పొదుపు పథకాలకు రూ.290 కోట్ల నిధులు జమ చేశామన్నారు. నేతన్నలకు కంట నీరు రాకుండా రాష్ట్రంలోని అన్ని శాఖల్లో అవసర మైన వస్త్రాలను టెస్కో ద్వారా కొనుగోలు చేయాలని నిర్ణయించామని, ఇప్పటికే నేత కార్మికులకు రూ.900 కోట్ల ఆర్డర్లు ప్రభుత్వం అందించిందన్నారు.

ముఖ్య మంత్రితో చర్చించి త్వరలోనే మిగతా ఆర్డర్లతో పాటు వర్కర్ టు ఓనర్ కార్యక్రమాన్ని పున రుద్ధరిస్తామని అన్నారు. చేనేత రంగానికి చెందిన పరిశ్రమలను సిరిసిల్ల, వరంగల్ వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తున్నామని, దేశవ్యాప్తంగా వివిధ ప్రాం తాల్లో పని చేస్తున్న నేత కార్మికులు తిరిగివచ్చేలా మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామన్నారు. తెలంగాణలో జీవనోపాధి ఎక్కువగా నేతన్న, రైతాం గం రెండు రంగాలు ముందువరుసలో ఉంటుందన్నా రు. కేంద్రాన్ని పోషించే రాష్ట్రాల్లో తెలంగాణ ముందు వరుసలో ఉంటుందన్నారు. డబ్బులు ఎవరి అబ్బ సొత్తు కాదని ప్రజల సొత్తు అని అన్నారు. కేంద్రానికి పంపించే పన్నుల్లో 30 పైసలు మాత్రమే తెలం గాణకు వస్తున్నాయన్నారు. కొందరు కేంద్ర పథకాల తో నడుస్తున్నాయని, కేంద్రానికి సంబంధించిన ఫొటో పెట్టాలని, అర్థంపర్థం లేని మాటలు మాట్లాడుతూ అస్తవ్యస్తమైన వ్యవహారాలు చేస్తూ అగాధాన్ని సృష్టిస్తూ అపోహలు పెంచుతున్నారన్నారు.

కేంద్ర, రాష్ట్రాలకు సంబంధించి ఎవరి బాధ్యత వారికి, ఎవరి కార్యక్రమాలు వారికి ఉంటాయన్నారు. ఎవరూ కేంద్ర, రాష్ట్ర పదవుల్లో ఉండాలో ప్రజలు నిర్దేశిస్తారని, దాని ప్రకారం రాజ్యాంగబద్ధంగా పరిపాలన చేయాల న్నారు. ప్రజల సొత్తు ప్రజలకే దక్కే విధంగా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పనిచేస్తోంద న్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో నీటి పారుదల రంగం, విద్య, వైద్యం, సంక్షేమం, మంత్రులు పొన్నం శ్రీధర్‌బాబులు చూస్తున్నారన్నారు. చిత్తశుద్ధితో కాం గ్రెస్ ప్రభుత్వం నేతన్నల సంక్షేమం కోసం పనిచేస్తుం దని అన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, ఎస్పీ మహేష్ బీ గితే, టెక్స్‌పోర్టు సీఈవో సురేష్ గోయెంకా, శేఖర్, అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్, ఆర్డీవో రాధాబాయి, వేములవాడ ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే కటకం మృత్యుంజయం, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి, సెస్ ఛైర్మన్ చిక్కాల రామారావు,

మిగతా 8వ పేజీలో





టెక్స్‌పోర్టు సంస్థను ప్రారంభిస్తున్న మంత్రులు, శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రులు తుమ్మల, శ్రీధర్‌బాబు, పొన్నం

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశ పెడుతున్న పథకాలను మహిళలు సద్వినియోగపర్చుకుని ఆర్థి క పురోగతి సాధించాలని ఐకేపీ ఏపీఎం మల్లేశం అన్నారు. ఎల్లారెడ్డిపే ట మండల కేంద్రంలోని కావేరి మండల సమాఖ్య కార్యాలయంలో శుక్రవారం గ్రామాఖ్య సంఘాల అధ్యక్షులతో సమావేశం ఏర్పాటు చేశా రు. ఈ సందర్భంగా మల్లేశం మాట్లాడుతూ ఎల్లారెడ్డిపేట, కోరుట్లపేట గ్రామాల్లో మహిళలకు ప్రభుత్వం ఎరువులు, విత్తనాల దుకాణాలను కేటాయించిందన్నారు. అనుమతి కోసం దరఖాస్తులు చేసుకోవాలన్నా రు. సమావేశంలో సీసీలు మంగ్యానాయక్, నాగరాజు, దేవేందర్, సుధా కర్, రమణ, పద్మ, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

పవర్‌లూం కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

సిరిసిల్ల టౌన్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం సిరిసిల్ల పవర్ లూం కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధానకార్యదర్శి కడారి రాములు అన్నారు. శుక్రవారం సిరిసిల్ల పట్ట ణం కార్మిక భవనంలో ఏఐటీయూసీ జిల్లా ముఖ్యనాయకుల సమావే శంలో ఆయన మాట్లాడారు. పవర్‌లూం కార్మికుల వేతన ఒప్పందం ప్రకారం కూలి ఇస్తూ బోనస్ చట్టం అమలు చేయాలన్నారు. వర్కర్ టూ ఓనర్ పతకంను అమలుచేయాలని డిమాండ్ చేశారు. సిరిసిల్లలో విద్యుత్ సమస్యలను పరిష్కరించి పవర్‌లూంలు నడిచేలా చేయాల న్నారు. 2023లోని 10శాతం యారన్ సబ్సిడీని ప్రభుత్వం చెల్లించాల న్నారు. సమావేశంలో ఏఐటీయూసీ జిల్లాఅధ్యక్షుడు అజ్జ వేణు, నాయ కుల మీసం లక్ష్మన్, కేవీ అనసూయ, గాజుల పోశెట్టి పాల్గొన్నారు.

కార్మికులకు యారన్ సబ్సిడీ అందించాలి

తంగళ్లపల్లి, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): వస్త్రపరిశ్రమ కార్మికుల యార న్ సబ్సిడీని ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని సీపీఐ జిల్లా కార్య దర్శి గుంటి వేణు డిమాండ్ చేశారు. శుక్రవారం తంగళ్ళపల్లి మండల కేంద్రంలోని సీపీఐ గ్రామ మహాసభ జరిగింది. ఈ కార్యక్రమానికి ము ఖ్యఅతిథిగా హాజరైన వేణు మాట్లాడుతూ ఏడాది గడుస్తున్నా ఇప్పటి వరకు కార్మికులకు యారన్ సబ్సిడీ విడుదల చేయలేదన్నారు. జూన్ 12, 13తేదీల్లో తంగళ్లపల్లి మండల కేంద్రంలో నిర్వహించే జిల్లా మహా సభలకు రాష్ట్ర, కేంద్ర నాయకులు హాజరవుతారన్నారు. గ్రామ శాఖ కార్యదర్శి రాజు, సహాయ కార్యదర్శి బాలరాజు, నాయకులు ఎలగందు ల రాజు, రాములు, చంద్రమౌళి, నాగరాజు, గణేష్, మల్లేశం, మాచర్ల రాములు తదితరులు పాల్గొన్నారు.

ఫ్లెక్సీ వివాదం..

సిరిసిల్ల, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల అపెరల్ పార్కులో శుక్ర వారం టెక్స్‌పోర్టు గార్మెంట్ యూనిట్ ప్రారంభోత్సవ సభ వేదికపై ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ వివాదాస్పదంగా మారింది. ఫ్లెక్సీపై ముఖ్యమం త్రి రేవంత్‌రెడ్డితో పాటు కాంగ్రెస్ మంత్రుల ఫోటోలు మాత్రమే ఏర్పా టు చేశారు. వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కేంద్ర హోం సహాయ మంత్రి బండి సంజయ్, సిరిసిల్ల ఎమ్మెల్యే బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఫొటోలు లేవు. దీంతో కేటీఆర్ ఫొటో కావా లని పెట్టలేదని బీఆర్‌ఎస్ నాయకులు సోషల్ మీడియాలో వైరల్ చేసే ప్రయత్నం మొదలుపెట్టారు. దీంతో మంత్రులు రాకముందే వేదికపై చేనేత జౌళి శాఖ అధికారులు ఫ్లెక్సీని తొలగించారు.

స్వాగతంలో సరదాగా నవ్వులు..



మంత్రులకు స్వాగతం పలుకుతున్న శైలజరామయ్యార్

సిరిసిల్ల, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల అపెరల్ పార్కులో టెక్స్ పోర్టు గార్మెంట్ యూనిట్ ప్రారంభోత్సవంలో సరదాగా నవ్వులు పూశా యి. టెక్స్‌టైల్ కమిషనర్‌గా శైలజరామయ్యార్ ఉన్నారు. శుక్రవారం మంత్రులు శ్రీధర్‌బాబు, తుమ్మల నాగేశ్వర్‌రావు, పొన్నం ప్రభాకర్‌లు యూనిట్ ప్రారంభోత్సవానికి వచ్చారు. తమ శాఖ తరఫున మంత్రుల కు స్వాగతం పలికే సమయంలో శ్రీధర్‌బాబు సతీమణి చేనేత జౌళి శాఖ డైరెక్టర్‌గా ప్రోటోకాల్ ప్రకారం శైలజరామయ్యార్ కావడంతో స్వా గతం పలుకుతుండగా సరదాగా నవ్వుకున్నారు.

జర్నలిస్టులు ప్రభుత్వానికి ప్రజలకు వారధులు

- మంత్రులు పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

సిరిసిల్ల, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): జర్నలిస్టులు ప్రభుత్వానికి, ప్రజల కు వారధులుగా ఉంటూ సత్యదూరమైన వార్తలను పరిశోధించి ప్రజల కు అందించాలని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబులు సూచించారు. శుక్రవా రం సిరిసిల్లలోని లహరి ఫంక్షన్‌హాల్‌లో సిరిసిల్ల ప్రెస్‌క్లబ్ నూతన అధ్యక్షుడు అకుల జయంత్, ప్రధానకార్యదర్శి అడెపు మహేందర్, ఉపా ధ్యక్షుడు బొడ్డు పర్శరాములు, కోశాధికారి వంకాయల శ్రీకాంత్, సహా య కార్యదర్శి కంకణాల శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులతో మంత్రి పొన్నం ప్రమాణ స్వీకారం చేయించారు. ఈసందర్భంగా మంత్రులు మాట్లాడు తూ జర్నలిస్టులకు అండగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభు త్వ విప్ ఆది శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే కటకం మృత్యుంజయం, సెస్ ఛైర్మన్ చిక్కాల రామారావు, కాంగ్రెస్ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి, గ్రం థాలయ సంస్థ ఛైర్మన్ నాగుల సత్యనారాయణ, సీపీ కృష్ణ, ఎన్నికల అధికారులు కె భద్రాచలం, తడుక విశ్వనాథం, టీవి నారాయణ, మార్కె ట్ కమిటీ ఛైర్‌పర్సన్ స్వరూపరెడ్డి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చొప్ప దండి ప్రకాష్, మహిళ అధ్యక్షురాలు కాముని వనిత పాలొన్నారు. పాల కవర్గాన్ని సన్మానించిన వారిలో బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, అర్బన్ బ్యాంక్ ఛైర్మన్ రాపెల్లి లక్ష్మీనారాయణ, వైస్‌ఛైర్మన్ అడ్డగట్ల మురళి, ఎండీ సత్తార్, మున్సిపల్ మాజీ వైస్‌ఛైర్మన్ మంచె శ్రీనివాస్, రైతు సమన్వయ సమితి మాజీ అధ్యక్షుడు అగ్గిరాములు, హరీష్, శ్రీనివాస్, రవిగౌడ్, చింతోజు భాస్కర్ సన్మానించారు.

కేసీఆర్, కేటీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం



కేసీఆర్, కేటీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

సిరిసిల్ల టౌన్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : గతంలో కేటీఆర్ సహకారంతోనే ప్రస్తుతం అపెరల్ పార్క్ సాకారమైందని బీఆర్‌ఎస్ సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి అన్నారు. సిరిసిల్ల పెద్దూరులో అపెరల్ పార్క్‌లో పంక్చయేట్ వరల్డ్ ప్రైవేటు లిమిటెడ్(టెక్స్‌పోర్ట్)యూనిట్ ఏర్పాటుకు నాటి ముఖ్యమంత్రి కేసీ ఆర్, మంత్రి కేటీఆర్ కృషితోనే ప్రారంభించుకుంటున్నామని హర్షం వ్యక్తం చేస్తూ శుక్రవారం సిరిసిల్ల పట్టణం చేనేత చౌక్ వద్ద బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో కేసీఆర్, కేటీ ఆర్ చిత్రపటానికి నాయకులు క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ పట్టణ కార్యదర్శి మ్యాన రవి, ఉపాధ్యక్షుడు ఎండీ సత్తార్, మహిళ పట్టణ అధ్యక్షురాలు బత్తుల వనజ, సిరిసిల్ల అర్బన్ బ్యాంక్ ఛైర్‌పర్సన్ రాపెల్లి లక్ష్మీనారా యణ, వైస్‌ఛైర్మన్ అడగట్ల మురళి, జిల్లా గ్రంథాలయం మాజీ ఛైర్మన్ ఆకునూరి బాలరాజు, బీఆర్‌ఎస్వీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి సబ్బని హరీష్, యూత్ పట్టణ అ ధ్యక్షుడు సుంకపాక మనోజ్, మాజీ కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

పూలేను ఆదర్శంగా తీసుకొని ప్రభుత్వం ముందుకు..

- మంత్రులు తుమ్మల, దుద్దిళ్ల, పొన్నం.. ఘనంగా నివాళులు..

సిరిసిల్ల, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): సామాజిక న్యాయం కోసం బల హీనవర్గాలకు మహాత్మా జ్యోతిబా పూలే చూపిన మార్గదర్శకత్వంతో వారిని ఆదర్శంగా తీసుకొని తెలంగాణ ప్రభుత్వం ముందుకు పోతోం దని చేనేత జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, ఐటీ, పరిశ్రమ ల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌లు అన్నారు. శుక్రవారం సిరిసిల్ల గాంధీ చౌక్ వద్ద, జిల్లా గ్రంథాలయ సంస్థ భవనంలోఆధునిక యువ వైతాళికుడు, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి పాటుపడిన మహా త్మా జ్యోతిబాపూలే జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడు తూ అహ్మదాబాద్ ప్లీనరీలో రాహుల్‌గాంధీ దేశానికి తెలంగాణ దిక్సూ చిగా ఉందని తెలిపారని అన్నారు. కుల గణన చేసి బీసీలకు రాజకీ య, విద్య, ఉద్యోగాల్లో 42 శాతం రిజర్వేషన్లు పెంచుతూ చట్టం చేయ డం జరిగిందన్నారు. తెలంగాణ ప్రభుత్వం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పీసీసీ చీఫ్ మహేష్‌కుమార్ గౌడ్ సహచార మంత్రులు కలిసి ఎస్సీ వర్గీకరణ, బీసీ రిజర్వేషన్లు పెంచడం జరిగిందన్నారు. సిరిసిల్లలో జ్యోతిబా పూలే విగ్రహం లేకపోవడం బాధాకరమని అన్నారు. వచ్చే జయంతిలోపు పూలే కాంస్య విగ్రహం ఏర్పాటు చేసుకోవాలని, వచ్చే సంవత్సరం విగ్రహానికి దండ వేసుకునే విధంగా ఉండాలని అన్నారు. సిరిసిల్ల కాంగ్రెస్ ఇన్‌చార్జి కేకే మహేంద ర్‌రెడ్డి, గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ నాగుల సత్యనారాయణ, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, మార్కెట్ కమిటీ ఛైర్మన్ వెల్ముల స్వరూపరెడ్డి, మాజీ అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు అకునూరి బాలరాజు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సూర దేవ రాజు, మహిళ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు కాముని వనిత, పద్మశాలీ సంఘం అధ్యక్షుడు గోలి వెంకటరమణ, మాజీ మండల అధ్యక్షుడు వైద్య శివప్రసాద్, మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ గడ్డం నర్సయ్య, పట్ట ణ కార్యదర్శి మ్యాన ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



పూలేకు నివాళులు అర్పిస్తున్న మంత్రులు

గ్రంథాలయాన్ని సందర్శించిన మంత్రులు

రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని సినారె కేంద్ర గ్రంథాలయాన్ని మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్‌బా బు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌లు సందర్శించారు. జ్యోతిబా పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు తెలిపారు. అనంతరం గ్రంథాలయంలో పోటీపరీక్షలకు సిద్ధమవుతున్న యువతులతో మాట్లా డారు. ప్రభుత్వ నోటిఫికేషన్లు ఇతర అంశాలను చర్చించారు. గ్రంథాల య సంస్థ ఛైర్మన్ నాగుల సత్యనారాయణను సన్మానించారు. వారి వెంట కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, ఎస్పీ మహేష్ బీ గీతే, అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్, కాంగ్రెస్ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, కాంగ్రెస్ నాయకులు వైద్య శివప్రసాద్, దేవరాజు, బాలరాజు, గడ్డం నర్సయ్య, సంగీతం శ్రీనివాస్ పాల్గొన్నారు.

బడుగు బలహీనవర్గాల ఆశాజ్యోతి పూలే

- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా.. కలెక్టరేట్‌లో ఘనంగా జయంతి



కలెక్టరేట్‌లో జ్యోతిబా పూలే జయంతి వేడుకలు

సిరిసిల్ల కలెక్టరేట్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి మహా త్మా జ్యోతిబా పూలేనని, ఆయన ఆశయ సాధన లో ప్రతి ఒక్కరు ముం దుకు సాగాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా అన్నారు. సిరిసిల్ల కలెక్ట రేట్‌లో శుక్రవారం బీసీ సంక్షేమశాఖ శాఖ ఆధ్వ ర్యంలో మహాత్మా జ్యోతి బా పూలే జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్‌లు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సంద ర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పూలే జీవితం అంద రికీ ఆదర్శనీయమన్నారు. సామాజిక కార్యకర్తగా, వర్ణ వివక్షకు వ్యతిరేకంగా పోరాడిన సంఘ సంస్క ర్త పూలే భావితరాలకు సైతం మార్గదర్శకుడన్నా రు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమాధికారి రాజ మనోహర్, డీపీఆర్వో వంగరిశ్రీధర్ పాల్గొన్నారు.

- జిల్లా ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో..

సిరిసిల్ల జిల్లా ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం మహాత్మాజ్యోతిబా పూలే జయంతి వేడు కలను ఘనంగా నిర్వహించారు. సిరిసిల్ల కలెక్టరేట్ ఆవరణలో జిల్లా ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళుల ర్పించారు. ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి, జిల్లా ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడు చొక్కాల రాము, గడ్డం నర్సయ్య, బొప్ప దేవయ్య, అకునూరి బాలరాజు, కీసరి శ్రీనివాస్, జిల్లా ఫిషరీస్ ఛైర్మన్ చొప్పరి రామచంద్రం, బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ జెల్ల వెంకటస్వామి, జిల్లా నాయకులు బోయిన దేవరాజ్, స్వామి, జంగాలపల్లి శేఖర్, కురుణాల అనిల్, చొక్కాల ప్రశాంత్, శ్రీనివాస్, కూనవేని పర్శరాములు, బొజ్జ కనుకయ్య, భద్రాచలం, వంకాయల కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరస్థుల చేతిలో మోసపోయిన మహిళ

చందుర్తి, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): సైబర నేరస్థుల చేతిలో ఓ మహిళ మోస పోయిన సంఘటన చందుర్తి మండలం సనుగులలో ఈనెల 9న జరుగగా, ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గ్రామ స్థుల కథనం ప్రకారం.. లక్ష్మి అనే మహిళ కుమారుడు మనోజ్ ఆరుమాసాల క్రితం దుబాయ్ వెళ్లాడు. ఈనెల 9న గుర్తు తెలియని వ్యక్తి ఆమెకు ఫోన్‌చేసి మీ కుమారుడి ప్రాణం బాగాలేదని, ఆసు పత్రికి తీసుకువచ్చామని, ఈ ఫోన్ నంబ ర్‌కు రూ.5వేలు పంపించాలని చెప్పగా ఆమె డబ్బులు పంపింది. కొంత సమయం తర్వాత ఆమె కొడుకుకు ఫోన్‌చేసి ఆరోగ్యం ఎలా ఉందని ఆరాతీసి జరిగిన విషయాన్ని తెలిపింది. దీంతో తాను మోసపోయానని గ్రహించి ఆమె చందుర్తి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అంజయ్య తెలిపారు.

కల్వలలో ఎక్సైజ్, టాస్క్‌ఫోర్స్ దాడులు

- 200లీటర్ల బెల్లం పానకం ధ్వంసం

శంకరపట్నం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం కల్వల గ్రామంలో శుక్రవారం ఎక్సైజ్, టాస్క్‌ఫోర్స్ అధికారులు దాడిచేసి 2 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకొని, 200లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేశారు. టాస్క్‌ఫోర్స్ సీఐ నాగేశ్వర్‌రావు ఆధ్వర్యంలో మండలంలోని కల్వల గ్రామంలో దాడులు చేసి శివరాత్రి మల్లయ్య అనేవ్యక్తి వద్ద 2 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నారు. నాటుసారా తయారీకి ఉపయోగించే 200లీటర్ల బెల్లం పానకం, తయారీ సామాగ్రిని ధ్వంసం చేసి అతనిపై కేసు నమోదు చేసినట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ తెలిపారు. ఈ దాడుల్లో హెడ్ కానిస్టేబుల్ మోసిన్, కానిస్టేబుళ్లు కుమార్, కమలాకర్, సంతోష్, సాయి, కాసిండి, కమలుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ఖోఖోలో రాణిస్తున్న క్రీడాకారులు

- సుల్తానాబాద్‌లో ఖేలో ఇండియా ఆధ్వర్యంలో శిక్షణ కేంద్రం
- రాష్ట్ర, జాతీయ స్థాయిలో పోటీల్లో ప్రతిభ
- ఐదేళ్ళ పాటు సెంటర్ కొనసాగింపు
- కోచ్ ద్వారా రోజూ శిక్షణ


ఖోఖో ఆడుతున్న క్రీడాకారులు

సుల్తానాబాద్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంత విద్యార్థిని విద్యార్థులను క్రీడల్లో ప్రోత్సహించేందుకు కేంద్ర క్రీడా మంత్రిత్వ శాఖ పరిధిలోని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా సుల్తానాబాద్‌లో ఖేలో ఇండియా సెంటర్‌ను మంజూరు చేశారు. ఖోఖో క్రీడలో శిక్షణ ఇవ్వడానికి ఈ సెంటర్ మంజూరు చేశారు. ఇక్కడ శిక్షణ పొందిన క్రీడాకారులు రాష్ట్ర జాతీయ స్థాయి పోటీలలో రాణిస్తూ పలు పతకాలు సాధిస్తున్నారు. గత ఏడాది ఫిబ్రవరిలో ఈ సెంటర్‌ను ప్రారంభించారు. మొదట సెంటర్ మార్కండయ కాలనీలోని పెరికిగిద్దె ఆంజనేయ స్వామి ఆలయానికి ఎదురుగా ఉన్న మినీ స్టేడియంలో నిర్వహించారు. అయితే అక్కడ సౌకర్యాలు లేకపోవడం, తగిన భద్రత కరువ వడంతో ఈ కేంద్రాన్ని ఇటీవల ప్రభుత్వ జూనియర్ కళాశాలకు మార్చారు. క్రీడలలో ఆసక్తి ఉన్న వారు ఈ కేంద్రానికి వచ్చి శిక్షణ పొందుతున్నారు. పలువురు విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో పాల్గొంటూ ఖేలో ఇండియా సెంటర్‌లో శిక్షణ పొందు తున్నారు. రోజూ సాయంత్రం ఐదు గంటల నుంచి రాత్రి ఏడు గంటల వరకు శిక్షణ కొనసాగు తుంది. అంతర్జాతీయ ఖోఖో క్రీడాకారుడు, బంగారు పతాక గ్రహీత గెల్లు మధూకర్‌ను కోచ్‌గా నియమించి ఖోఖోలో శిక్షణ ఇస్తున్నారు.

పలు రాష్ట్ర జాతీయ స్థాయి పోటీలలో....


జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన వైష్ణవి

ఖోఖోలో శిక్షణ పొందిన క్రీడాకారులు పలువురు రాష్ట్ర జాతీయ స్థాయి పోటీలలో పాల్గొని పలు పతకాలు సాధించారు. జి వైష్ణవి అనే విద్యార్థిని కేరళలో జరిగిన జాతీయ స్థాయి పోటీలలో పాల్గొని పతకం సాధించింది. అలాగే సీఎం కప్ పోటీలు, స్కూల్ గేమ్ ఫెడరేషన్ పోటీలలో కూకట్ల అఖిల్, నాంపల్లి సిద్దార్థ, శ్రీగిరి అభిరనందన్, గొట్టం చరణ్ అజయ్, మనోజ్ మహాలక్ష్మి శృతి తదితరులు రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొన్నారు. ఉమ్మడి జిల్లా స్థాయి పోటీలలో మరో ఇరవై మంది ఆడారు. మహాలక్ష్మి, శ్రీగిరి అభిర నందన్ సీఎం కప్ పోటీలలో బహుమతులు సాధించారు.


జాగింగ్ చేస్తున్న క్రీడాకారులు

రోజూ 60 నుంచి 70 మందికి శిక్షణ

గెల్లు మధూకర్, ఖేలో ఇండియా సెంటర్ కోచ్



సుల్తానాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఖేలో ఇండియా సెంటర్ ద్వారా రోజు 60 నుంచి 70 మంది బాల బాలికలకు ఖోఖో లో శిక్షణ ఇస్తున్నాం. ఖోఖో ద్వారా నేను అంతర్జాతీయ స్థాయి పోటీలలో పాల్గొని పతకాలు సాధించాను. పిల్లలకు కూడా తగిన తర్ఫీదు ఇస్తూ వారిని కూడా జాతీయ అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా కృషి చేస్తాను.

గ్రామీణ ప్రాంత క్రీడాకారులను ప్రోత్సహించాలి

- సురేష్, జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి



గ్రామీణ ప్రాంత క్రీడాకారులను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం సుల్తానాబాద్ లో ఖేలో ఇండియా సెంటర్‌ను మంజూరు చేసింది. ఇందులో ఆసక్తి ఉన్న క్రీడాకారులకు ఖోఖోలో శిక్షణ ఇస్తాం. ప్రతీ జిల్లాకు ఒక సెంటర్ మంజూరు కాగా పెద్దపల్లికి ఖోఖో సెంటర్ మంజూరైంది. ఈ సెంటర్‌ను సుల్తానాబాద్‌లో ఏర్పాటు చేశాం. ఇది ఐదేళ్ల పాటు కొనసాగుతుంది. ఇందులో శిక్షణ పొందిన పిల్లలు రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలలో రాణించి బంగారు పతకాలు సాధించే విధంగా శిక్షణ ఇస్తున్నాం.

సెంటర్ ఏర్పాటుతో ఖోఖోకు పూర్వ వైభవం

పారుపల్లి వెంకట ఉమాపతి, ఖోఖో అసోసియేషన్ రాష్ట్ర మాజీ కార్యదర్శి



సుల్తానాబాద్ లో స్పోర్ట్స్ అథారిటీ వారు ఖేలో ఇండియా సెంటర్‌ను ఏర్పాటు చేయడం ద్వారా ఖోఖో క్రీడకు పూర్వ వైభవం చేకూరింది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఖోఖో క్రీడకు సుల్తానాబాద్ నిలయంగా ఉండేది. సెంటర్‌ను సుల్తానాబాద్ లో ఏర్పాటు చేయడం ద్వారా ఈ ప్రాంత క్రీడాకారులకు ఎంతో వెసలుబాటుగా ఉంటుంది. వారిలో దాగి ఉన్న క్రీడా ప్రతిభ ఈ సెంటర్ ద్వారా వెలుగులోకి వచ్చి జాతీయ అంతర్జాతీయ పోటీలలో పాల్గొనే అవకాశాలు వస్తాయి.

హత్య కేసులో ఒకరికి జీవిత ఖైదు

జగిత్యాల క్రైం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): హత్యచేసిన కేసులో ఒకరికి జీవిత ఖైదుతోపాటు ఐదువేల రూపాయల జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీలిమ శుక్రవారం తీర్పు నిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. జగిత్యాల జిల్లాలోని మెట్‌పెల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆరెపేటకు చెందిన షేక్‌అహ్మద్ మేస్త్రీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. 2023 ఫిబ్రవరి18వ తేదీన పనికి వెళ్లకుండా స్నేహితులతో కలిసి అహ్మద్ మద్యం సేవించాడు. మద్యం మత్తులో చెట్‌పెల్లి సురేష్ అనే వ్యక్తికి అహ్మద్‌కు మధ్య సిమ్ కార్డు విషయంలో గొడవ జరిగింది. దీంతో సురేష్ తన జేబులో ఉన్న నేల్‌కట్టర్‌తో అహ్మద్ కడుపులో పొడిచాడు. తీవ్ర గాయాలైన అహ్మద్‌ను కుటుంబసభ్యులు మెట్‌పెల్లిలోని ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్సకోసం తరలించారు. మెరుగైన వైద్యం కోసం నిజామాబాద్‌కు తరలించగా చికిత్స పొందుతూ అహ్మద్‌మృతిచెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్సై శ్యాంరాజ్ కేసు నమోదు చేయగా సీఐ లక్ష్మీనారాయణ కేసుదర్యాప్తు చేసి నిందితుడైన రాయికల్ మండలం వీరాపూర్ గ్రామానికి చెందిన సురేష్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. సీఎంఎస్ ఎస్సై శ్రీకాంత్, కోర్టుడ్యూటీ అధికారులు రంజిత్, కిరణ్ కుమార్ సరైనసాక్ష్యులను కోర్టులో ప్రవేశపెట్టగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ మల్లికార్జున్ కేసు వాధించారు. నేరం రుజువు కావడంతో ముద్దాయి సురేష్‌కు జీవిత ఖైదు విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. నిందితుడికి శిక్ష పడడంలో కృషిచేసిన పోలీస్ అధికారులను ఎస్పీ అశోక్ కుమార్ అభినందించారు.

పుస్తెల తాడు చోరీ

సిరిసిల్ల క్రైం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణంలోని చంద్రంపేటలో గురువారం అర్ధరాత్రి ఇంట్లో నిద్రిస్తున్న మొగిలి రాజవ్వ(70) మెడలోని రెండు తులాల పుస్తెల తాడును ఓ ఆగంతకుడు ఎత్తుకెళ్లాడు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు దొంగను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

ఎంజేపీ పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేసిన జాయింట్ సెక్రెటరీ


కళాశాల సిబ్బంది, విద్యార్థినులతో మాట్లాడుతున్న శ్యాం ప్రసాద్‌లాల్

తిమ్మాపూర్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం లోని మహాత్మా జ్యోతిబాపూలే బాలికల గురుకుల పాఠశాల, కళాశాలను గురుకుల పాఠశాలల జాయింట్ సెక్రెటరీ శ్యాంప్రసాద్ లాల్ శుక్రవారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. బాలికల గురుకులంతోపాటు ఇంటర్ కళాశాల, వ్యవసాయకళాశాల విద్యార్థినులతో ఆయన మాట్లాడారు. రికార్డులను పరిశీలించారు. మెనూప్రకారం భోజనం పెడుతున్నారా, ఎమైనా సమస్యలు ఉన్నాయా అని విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. వస్తువుల నాణ్యత, కిచెన్‌ను తనిఖీ చేశారు. ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని ఎవరికి భయపడవద్దని విద్యార్థినులకు అభయం ఇచ్చారు. ఆర్సీవో అంజలి, ప్రిన్సిపాల్ సరిత, అధ్యాపకులు, ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు.

కట్నం కోసం వేధించిన కేసులో భర్తకు ఏడాది జైలు శిక్ష

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): అదనపు వరకట్నం కోసం కట్టుకున్న ఇల్లాలును వేధించిన కేసులో సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని చిన్నబోనాల గ్రామానికి చెందిన భర్త పడగ తిరుపతికి యేడాది పాటు జైలు శిక్షతో పాటు రూ.వేయి జరిమానాను విధిస్తూ సిరిసిల్ల అదనపు ప్రథమ శ్రేణి న్యాయ మూర్తి సృజన తీర్పు చెప్పారని ఎస్ఐ రమాకాంత్ శుక్రవారం పేర్కొన్నారు. ఆయన కథనం మేరకు.. ఎల్లారెడ్డిపేట మండలం పోతిరెడ్డిపల్లి గ్రామంలోని అడిగె మాధవికి చిన్నబోనాల గ్రామానికి చెందిన పడగ తిరుపతితో 2007లో వివాహమైంది. ఆ సమయంలో మాధవి పుట్టింటి వారు రూ. 4లక్షల నగదుతో పాటు 5 తులాల బంగారు,30 తులాల వెండి ఆభరణాలు ఇతర లాంచనాలతో పెళ్లి జరిపించారు. ఐదేళ్ల పాటు అన్యున్యంగా దంపతులు కలిపి జీవించారు. అనంతరం భర్త తిరుపతి తన తల్లిదండ్రుల ప్రోద్బలంతో అదనపు కట్నం కోసం వేధించేవాడు. ఈ క్రమంలో భరించలేక మాధవి తన పుట్టింటికి చేరుకుంది. మొదటి భార్య ఉండగానే తిరుపతి మరో యువతిని వివాహం చేసుకున్నాడు. తనను మోసం చేసి రెండో పెళ్లి చేసుకున్నాడని పేర్కొంటూ భర్త, అతని కుటుంబ సభ్యులపై మాధవి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. అప్పటి ఎస్ఐ నరేశ్ న్యాయస్థానంలో చార్జీ షీటు దాఖలు చేశారు. సీఎంఎస్ ఎస్ఐ రవీందర్‌నాయుడు, ఆర్ఎస్ఐ శ్రవణ్ ఆధ్వర్యంలో కోర్టు కానిస్టేబుల్ శంకర్‌లు సాక్ష్యులను కోర్టులో ప్రవేశ పెట్టారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ సతీష్‌కుమార్ వాదించారు. పూర్వాపరాలను పరిశీలించిన న్యాయమూర్తి సృజన నిందితుడు తిరుపతికి యేడాది పాటు జైలు శిక్షతో పాటు రూ.వేయి జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారని ఎస్ఐ రమాకాంత్ వివరించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


అజయ్ (ఫైల్)

కథలాపూర్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని వరదకాలువ శివారులో పల్లికొండ అజయ్(20) అనే యువకుడు శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. కథలాపూర్ నుంచి భూషణరావుపేటకు ద్విచక్రవాహనంపై అజయ్‌వెళ్తున్న క్రమంలో ప్రమాదం జరిగిందని పోలీసులు తెలిపారు. ద్విచక్రవాహనం కొంతదూరం పడి ఉండడంతో ఎవరైనా ఎదురుగా వచ్చి అజయ్‌ను ఢీకొట్టడంతో మృతి చెంది ఉంటాడా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో పోలీసులు పరిసరాల్లో ఉన్న సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలిస్తున్నారు. అజయ్ కోరుట్లలో ఓప్రైవేట్‌కళాశాలలో డిగ్రీసెకండ్ ఇయర్ చదువుతున్నాడు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని కోరుట్ల ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం పంపించారు.

అత్యాచారయత్నం కేసులో వ్యక్తి అరెస్టు

ఎలిగేడు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ఎలిగేడు మండలం రాములపల్లి గ్రామంలో ఐదేళ్ల బాలికపై అత్యాచారయత్నానికి పాల్పడిన కేసులో యువకుడిని అరెస్ట్ చేసినట్లు జూలపల్లి ఎస్సై సనత్‌కుమార్ తెలిపారు. అదేగ్రామానికి చెందిన తీట్లనవదీప్(22) అత్యాచారయత్నానికి పాల్పడినట్లు పేర్కొన్నారు. గురువారం మధ్యాహ్నం సమయంలో అత్యాచారయత్నం చేశాడని బాధితురాలి తల్లి ఇచ్చిన ఫిర్యాదుమేరకు ఫోక్సోచట్టం కింద కేసునమోదు చేశామన్నారు. శుక్రవారం నిందితుడిని సుల్తానాబాద్ కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

వీణవంక, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రెడ్డిపల్లి గ్రామానికి చెందిన పొడపత్రపు హరీష్(32) మద్యానికి బానిసై జీవితంపై విరక్తి చెంది మార్చి 16న పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు ఆసుపత్రికి తరలించారు. అప్పటి నుంచి చికిత్స పొందుతూ శుక్రవారం జమ్మికుంటలోని ఓ ప్రైవేటు అసుపత్రిలో మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. భార్య అంజలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తోట తిరుపతి తెలిపారు.

ముగ్గురిపై అట్రాసిటీ కేసు నమోదు

మంథనిరూరల్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోపాల్‌పూర్ గ్రామానికి చెందిన ముగ్గురు మహిళలపై మంథని పోలీసుస్టేషన్‌లో శని వారం ఎస్సీఎస్టీ అట్రాసిటీ కేసునమోదైంది. గోపాల్ పూర్‌లో వీవోఏగా పనిచేస్తున్న గొరిగే జయసుధను విధుల నుంచి తొలగించిన విషయంలో పీడీ ఆదేశాల మేరకుగ్రామంలో విచారణ జరిగింది. ఆ సమయంలో ఆమెను, అదే గ్రామానికి చెందిన ఎరుకల సమ్మక్కను వీవో అధ్యక్షురాలు లక్కసరిత, దాసరిబుజమ్మ, దాసరి రమాదేవీలు కులంపేరుతో దూషించినట్లు బాధితు రాలు జయసుధ మంథని పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగాముగ్గురిపై అట్రాసిటీ కేసునమోదుచేసి విచారణ జరుపుతున్నారు.

ఉద్యోగం పేరుతో మోసం.. కేసు నమోదు

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): విదేశాలలో ఉద్యోగంపేరుతో యువకుడిని మోసం చేసిన వ్యక్తిపై కరీంనగర్ రెండో ఠాణాలో పోలీసులు కేసు నమోదు చేశారు. రెండో ఠాణా సీఐ సృజన్‌రెడ్డి వివరాల ప్రకారం... కరీంనగర్ భగత్‌నగర్‌కు చెందిన కె.మెహర్‌తేజ విదేశాల్లో ఉద్యోగంకోసం ప్రయత్నిస్తున్నాడు. అతడి స్నేహితుడి ద్వారా కిరణ్ అనే వ్యక్తిని పరిచయమయ్యాడు. బ్యాంకాక్‌లో ఉద్యోగం కోసం కిరణ్‌కు రూ.30 వేలు ఇవ్వాలని ఒప్పందం కుదిరింది. అనంతరం బ్యాంకాక్ చేరుకున్న మెహర్‌తేజనుంచి కంపెనీవారు పాస్‌పోర్ట్ తీసుకొని క్రిప్టోకరెన్సీలో ఉద్యోగం ఇచ్చారు. ఆన్‌లైన్‌లో ప్రజలను మోసం చేయడం నచ్చని మోహర్‌తేజ అక్కడి భారత రాయబార కార్యాలయాన్ని సంప్రదించి ఇండియాకు వచ్చాడు. రావడంతోనే హైదరాబాద్‌లోని సైబర్ క్రైం విభాగాన్ని ఆశ్రయించాడు.

ఈ ఉపాధ్యాయుడు మాకొద్దు

- మైలారంలో విద్యార్థులు, గ్రామస్థుల ధర్నా


ధర్నా నిర్వహిస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామస్థులు

గన్నేరువరం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): క్రమ శిక్షణతోపాటు విద్యా బుద్దులు నేర్పించాల్సిన ఉపాధ్యాయుడు విచక్షణ మరిచి బాధ్యతా రాహిత్యంగా చితకబాదు తున్నాడని, పాఠశాల హెచ్ఎంతోపాటు పాఠశాల సిబ్బందిని భయ భ్రాంతులకు గురిచేస్తున్న ఉపాధ్యాయుడిని పాఠశాలనుంచి పంపించేయాలని విద్యార్థులు, తల్లిదండ్రులతోపాటు గ్రామస్థులు పాఠశాల ఎదుట శుక్రవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లి దండ్రులు మాట్లాడుతూ మైలారంలోని మండలపరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న రాంరాజయ్య పాఠాలు చెప్పకుండా తరగతి గదిలో నిద్రపోతుంటా రని, విద్యార్థులను విచక్షణారహితంగా చితకబాదుతున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. మధ్యాహ్న భోజన సిబ్బందిని, అటెండర్‌ను ప్రధానోపాధ్యాయుడిని సైతం బెదిరింపులకు గురి చేస్తున్నాడని ఆరోపించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు రాంరాజయ్య మీడియాతో మాట్లాడుతూ పాఠశాలలోని సమస్యలపై ప్రశ్నించినందుకు తనపై లేనిపోని ఆరోపణలు చేసి తన విధులకు ఆటంకం కలిగిస్తున్నారని అన్నారు.

ఇంజనీర్లు జ్ఞాన సమాజాన్ని నిర్మించాలి


మాట్లాడుతున్న ఎస్‌యూ ఆర్ట్స్ అండ్‌సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సూరెపల్లి సుజాత

కొడిమ్యాల, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ఇంజనీర్లు గౌరవం కలిగిన జ్ఞాన సమాజాన్ని నిర్మించాలని శాతవాహన యూనివర్సిటీ ఆర్ట్స్అండ్‌సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్‌సూరెపల్లి సుజాత అన్నారు. శుక్రవారం రాత్రి మండలంలోని నాచుపల్లి జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాల వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సుజాత మాట్లాడుతూ ఇంజనీర్లలో సృజనాత్మకత ఉండాలన్నారు. విద్యతో సంపాదించుకున్న జ్ఞానంతో విజయాలను సాధించి ఉన్నతశిఖరాలను అధిరోహించాలన్నారు. అంతకుముందు జేఎన్‌టీయూ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి ప్రభాకర్ కళాశాల వార్షిక ప్రగతినివేదిక చదివివినిపించారు. అనంతరం విద్యార్థులుచేసిన నృత్యాలుఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో వివిధ విభాగాల అధిపతులు, విద్యార్థులు, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

శోభాయమానంగా రాములోరి రథోత్సవం

- ఉత్సవాల్లో పాల్గొన్న ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్


రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

పెగడపల్లి, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నంచర్ల సీతారామచంద్రస్వామి ఆలయంలో శుక్రవారం రాములోరి రథోత్సవాన్ని శోభాయమానంగా నిర్వహించారు. శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా ఆరు రోజులుగా జరుగుతున్న బ్రహ్మోత్సవాల చివరి రోజైన శుక్రవారం ముందుగా హోమం కార్యక్రమం నిర్వహించి సీతారామ చంద్రస్వాముల ఉత్సవవిగ్రహాలను అందంగా అలంకరించిన రథంపై ఉంచి ఆలయం చుట్టూ జైశ్రీరాం నినాదాలతో హనుమాన్ దీక్షాపరులు, భక్తులు వేడుకలను నిర్వహించారు. ఉత్సవాల్లో పాల్గొనేందుకు ప్రభుత్వవిప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ రాగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా లక్ష్మణ్‌కుమార్ ప్రత్యేకపూజలు నిర్వహించారు. కార్యక్రమాలలో ఆలయకమిటీచైర్మన్ బండివెంకన్న, ప్రధాన కార్యదర్శిమంత్రి హరగోపాల్, సింగిల్‌విండోచైర్మన్ మంత్రి వేణుగోపాల్, మైత్రిగ్రూప్ చైర్మన్ కొత్తజైపాల్‌రెడ్డి, మండలనాయకులు రాములుగౌడ్, అమిరిశెట్టి మల్లారెడ్డి, జనార్దన్‌రెడ్డి, లక్ష్మీరాజం, మల్లేశం, శ్రీనివాస్, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కొడుకులు కాదు.. కర్కోటకులు

- ముత్తారంలో తల్లిపై అత్యాచారయత్నం
- ప్రతిగా రోకలిబండతో దాడి.. కొడుకు మృతి
- ఎల్లారెడ్డిపేటలో తండ్రిని హతమార్చిన కొడుకు

కుటుంబ బంధాలు మసకబారుతున్నాయి. కన్న కొడుకులు కర్కోటకులుగా మారారు. క్షణికావేశంలో ఏం చేస్తున్నామో తెలియని పరిస్థితుల్లో అకృత్యాలకు పాల్పడ్డారు. మద్యం మత్తులో ఓ కొడుకు తల్లిపై అత్యాచారయత్నానికి పాల్పడగా ప్రతిఘటించి దాడి చేయడంతో మృతి చెందాడు. ఏ పని చేయకుండా తిరగవద్దని మందలించిన కన్నతండ్రినే కడతేర్చాడు ఓ కొడుకు.

ముత్తారం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): సభ్యసమాజం తలదించుకునేలా మద్యం మత్తులో కుమారుడు తల్లిపై అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. ఈ ఘటనలో ఆమె ప్రతిఘటించి దగ్గరలోనే ఉన్న రోకలిబండతో దాడి చేయగా తీవ్ర గాయాలపాలయ్యాడు. అతడిని ఆసుపత్రికి తరలించగా మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. గురువారం రాత్రి జరిగిన సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి.

పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలానికి చెందిన యువకుడు (33) కొంతకాలంగా తాగుడుకు బానిసయ్యాడు. దీంతో అతడి భార్య విడాకులు తీసుకొంది. అప్పటి నుంచి అతిగా మద్యం సేవిస్తున్నాడు. మద్యానికి డబ్బుల కోసం తల్లిదండ్రులను వేధిస్తుండేవాడు. ఈ క్రమంలో గురువారం రాత్రి అతిగా మద్యం తాగి ఇంటికి వచ్చాడు. పడుకొని ఉన్న తల్లి వద్దకు వెళ్లి అత్యాచారయత్నం చేశాడు.. ఖంగుతిన్న ఆమె కొడుకును నెట్టివేసి దగ్గరలో ఉన్న రోకలి బండతో దాడి చేయగా తీవ్ర గాయాలయ్యాయి.

అనంతరం తండ్రితోపాటు స్థానికులు అతడిని చికిత్స నిమిత్తం పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గోపతి నరేష్ తెలిపారు.


కొడుకు చేతిలో హతమైన కనకయ్య

ఎల్లారెడ్డిపేట : పని చేయకుండా తిరగవద్దని మందలించిన కన్నతండ్రినే కడతేర్చాడు ఆ కొడుకు. ఈ సంఘటన రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. గ్రామంలోని కుంచెం కనకయ్య(50) కూలి పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఒక్కాగానొక్క కొడుకు పర్శరాములు ఎలాంటి పనులు చేయకుండా జులాయిగా తిరుగుతున్నాడు. ఈక్రమంలో తండ్రి కనకయ్య కొడుకును మందలించడంతో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. ఆగ్రహించిన కొడుకు పర్శరాములు కర్రతో తండ్రిపై దాడి చేశాడు. దాంతో కనకయ్య స్పృహ తప్పి కింద పడిపోయాడు. కుటుంబ సభ్యులు 108లో సిరిసిల్ల ప్రభుత్వాసుపత్రికి తరలించగా, అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. సీఐ శ్రీనివాస్‌గౌడ్, ఎస్ఐ రమాకాంత్ ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. కొడుకు పర్శరాములు పరారీలో ఉన్నాడు. మృతుడికి భార్య దేవవ్వ, ఇద్దరు కూతుళ్ల సుమలత, మౌనికలు ఉన్నారు. మృతుడి సోదరుడు రవి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

చురుగ్గా కొనసాగుతున్న మల్కపేట కాలువ మరమ్మతు పనులు

● కుడి కాలువ ద్వారా నీటి విడుదలకు ఏర్పాట్లు



పల్లిమక్త- సుద్దాల గ్రామాల మధ్య వేస్తున్న పైప్‌లైన్

కోనరావుపేట, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): కోనరావుపేట మండలం మల్కపేట కాళేశ్వరం ప్రాజెక్టుప్యాకేజీ9లో మల్కపేట నుంచి మారుపాక గ్రామంవరకు గల మల్కపేట రిజర్వాయర్ కుడికాలువ మరమ్మతు పనులు రాష్ట్రప్రభుత్వవిప్, వేములవాడ ఎమ్మెల్యే ఆదిశ్రీనివాస్ ఆదేశాల మేరకు ముమ్మరంగా సాగుతున్నాయి. ప్రస్తుత నీటి కరువును దృష్టిలో ఉంచుకొని సాగు, తాగు నీటికి ఇబ్బందులు రాకుండా కుడికాలువలోకి నీటినివిడుదల చేయడానికి అధికారులు పనులు కొనసాగిస్తున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం రామన్నపేట, సుద్దాల మధ్యలోగల బ్రిడ్జిల కింద మట్టిని తొలగించి మధ్యలో కాలువపై పైపులువేశారు. నాగారం, పల్లిమక్తగ్రామాల మధ్యలో ప్రధాన రహదారిపై పైపులతో ప్రత్యామ్నాయ ఏర్పాట్లుచేస్తూ, కాలువలో వివిధచోట్ల చేరిన పూడిక తొలగిస్తున్నారు.

క్రీడల్లో సత్తాచాటిన గురుకుల కళాశాల విద్యార్థినులు

కరీంనగర్ రూరల్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి):శాతవాహన యనివర్సిటీపరిధిలో సౌత్ జోన్ స్పోర్ట్స్, అథ్లెటిక్స్, ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడల్లో కరీంనగర్ మండలం నగునూర్ తెలంగాణ సాంఘీకసంక్షేమగురుకులకళాశాల విద్యార్థినులు సత్తాచాటారు. ఖోఖోపోటీల్లో నికిత, సింధు,సుష్మ,అశ్రిత,హిమజరెండో స్థానంలో నిలిచారు. సౌత్‌జోన్‌పోటీల్లో అలగప్ప యునివర్సిటీ తమిళనాడులో నిర్వహించిన కబడ్డీలోఇస్రా,సుష్మిత,జెస్సీరావు యూనివర్సిటీ చెన్నైలో నిర్వహించిన వాలీబాల్‌లో కావ్య శ్రీ, గీతం యూనివర్సిటీ నిర్వహించిన చెస్ టోర్నమెంట్‌లో చాందిని, శివాని, కె నందిని ప్రతిభ కనబరిచారు. కరీంనగర్ అసోసియేషన్అథ్లెటిక్‌స్టేట్‌విభాగంలో హైదరాబాద్‌లో అక్షర, కరీంనగర్ అసోసియేషన్ ఫుట్‌బాల్ స్టేట్‌విభాగం నిజామాబాద్‌లో శ్రీహర్షిని, నవదిత, తేజస్వి, రచన, పుష్పలత, ఇష్మా, కావ్య, అంజలి, రాజమణి, నికిత, సత్య, శ్రీజ, కరీంనగర్ అసోసియేషన్ హ్యాండ్‌బాల్ రాష్ట్రస్థాయిపోటీల్లో రాజమణి పాల్గొన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను కళాశాలఆవరణలో ప్రిన్సిపాల్ మాలతి, వైస్ ప్రిన్సిపాల్‌సమత అభినందించారు.

'పండంటి' ఆరోగ్యం



● ఎండ వేడికి పండ్లతో చెక్
● పొంచి ఉన్న విషంపై జాగ్రత్త
● రసాయనాల కారణంగా దీర్ఘకాలంలో ప్రమాదం
● వేసవిలో హాయినిచ్చే పండ్లలో ఉపయోగాలు ఎన్నో

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

సూర్యుడు సుర్రుమంటున్నాడు.. వేడి, ఉక్కపోతలతో ప్రజలు అబ్బో ఎండలు అంటూ గడప దాటడానికి భయపడుతున్నారు. ఎండ తీవ్రతతో వాంతులు, విరేచనాలతో ఇబ్బందులు పడుతారు. వీటికి పండ్లు ఉపశమనాన్ని ఇస్తాయి. శరీరంలో ఉష్ణోగ్రతలు పెరగకుండా సమతుల్యం చేయడానికి పండ్లు ఎంతో ఉపయోగపడుతాయి. వేసవిలో ఎక్కువగా నీరు చెమట రూపంలో వెళుతుంది. దీని వల్ల లవణాలు కోల్పోయి నీరసపడుతాం. ఈ పరిస్థితుల్లో ఎక్కువగా పండ్లు తీసుకోవడం మంచిదని వైద్య నిపుణులు చెపుతున్నారు. వేడినుంచి ఉపశమనంగా ఆరోగ్యానిచ్చేవి పండ్లు. ఆపిల్ తింటే డాక్టర్ వద్దకు వెళ్లాల్సిన అవసరం లేదంటారు. జీర్ణశక్తికి అరటి ఉపయోగపడితే గ్యాస్ సమస్యకు బొప్పాయి ఉపయోగపడుతుంది. చల్లదనంతో పాటు ఆరోగ్యానికి ఎంతో మేలు ఇచ్చే పండ్లలోకి విషం చేరుతోంది. నగరాల్లో పండ్లవ్యాపారం వేసవిలో ఎక్కువగా ఉంటుంది. కానీ వ్యాపారులు రసాయనాలను పండ్లపై చిమ్మి ప్రజల జీవితాలతో ఆడుకుంటున్నారు. ఆహార భద్రత అధికారులు తనిఖీలు చేస్తున్నా ఆగడం లేదు.

● రసాయనాలు ఎందుకు..?

పండ్లపై రసాయనాలను స్ప్రే చేయడం వల్ల వేగంగా పండుతాయి. ఆకర్షణీయంగా కనిపిస్తాయి. ప్రధానంగా మామిడి, ఆపిల్, అరటి, సపోట, దానిమ్మ, జామ, బొప్పాయి, ఆరెంజ్‌లపై వీటిని ఎక్కువగా ఉపయోగిస్తున్నారు. కాల్షియం కార్బైడ్.. ఇది పౌడర్ రూ పంలో ఉంటుంది. పౌడర్ ప్యాకెట్లను పండ్ల మధ్యలో పెట్టి దానిపై టార్పాలిన్ కప్పి నీళ్లు చల్లుతారు. ఈ పౌడర్ నుంచి ఎసిటిలిన్ గ్యాస్ ద్వారా పండ్లు సరిగా పండకపోయినా అందంగా కనిపిస్తాయి. అరటి పండ్లపై ఎథోపాన్ రసాయనాన్ని చల్లుతారు. చెట్టు నుంచి గెలను తీసి స్ప్రే చేయడం లేదా నీటిలో ముంచడం వల్ల అరటికాయ పక్వానికి వస్తుంది. ఆపిల్ పండ్లపై పారాపిన్ అనే మైనాన్ని వినియోగిస్తారు. దీనిని మండించి వచ్చే ఆవిరిని ఆపిల్ పండ్లకు పడుతారు. దీని వల్ల పండ్లలోని నీటి శాతం ఉండిపోతుంది.



● వీటివల్ల జరిగే నష్టాలు..

రసాయనాలు ఉపయోగించి పండ్లను పక్వానికి తేవడం వల్ల మనిషి అవయవాలపై ప్రభావం చూపుతుంది. కడుపులో అల్సర్లు, నాడీ సంబంధిత వ్యాధులు, చర్మ వ్యాధులు, చూపు మందగించడం, క్యాన్సర్ వంటివి వస్తాయి. గర్భిణులు తినడం వల్ల గర్భాశయ వ్యాధులు, పిల్లలో జన్యుపరమైన లోపాలు వస్తా యి.

● జాగ్రత్తలు తీసుకోవాలి..

కృత్రిమంగా పండించిన పండ్లు ఎంతో ఆకర్షణీయంగా ఉండి అన్నీ ఒకే రంగులో కనిపిస్తాయి. పండును కోస్తే లోపల సరిగా పండకపోవడం, రుచిగా లేకపోవడం, పండిన వాసన రాకపోవడం మనం గమనించవచ్చు. ముఖ్యంగా వీలైనంతవరకు ప్రతి పండు తొక్క తీసి తినడం మంచిది. ఆపిల్‌కు మైనం పూత ఉన్నట్లు అనుమానం కలిగితే మూడు నిముషాలు వెనిగర్ సొల్యూషన్‌లో ఉంచాలి. నీటితో శుభ్రం చేయాలి. ద్రాక్ష, బొప్పాయి పండ్లను ఉప్పు నీటితో కడిగి తినాలి. మామిడి పండును వేగంగా ప్రవహించే నీటిలో మూడు నిముషాలు ఉంచి తినాలి.

● వేడి, నీరసాన్ని తగ్గించే ద్రాక్ష..



పండ్లలో ద్రాక్ష పండ్లు ఎంతో ముఖ్యమైనవి. ఇందులో విటమిన్లు, కాల్షియం, సోడియం, పొటాషియంతోపాటు నీరు 88.5శాతం, పాస్పరస్ 0.02, పిండి పదార్థాలు 10.2, ఇనుము 0.4, మాంసకృతులు 0.6, విటామిన్ ఎ 151ఐయు, విటామిన్ బి2 10.3, కాల్షియం 0.03, విటామిన్ సి 10మిల్లీగ్రాములు ఉంటాయి. ద్రాక్ష మలబద్దకాన్ని, పైల్స్‌ను నివారిస్తుంది. కాలేయం చురుకుదానాన్ని పెంచుతుంది. మూత్ర సంబంధ బాధలను తగ్గిస్తుంది. రక్తశుద్ధితోపాటు వేడి నీరసాన్ని తగ్గిస్తుంది. క్యాన్సర్ నివారణకు ఉపయోగపడుతుంది. బరువు తగ్గడానికి కూడా దోహదపడుతుంది.

● సాటిలేని ఆపిల్..



ఆపిల్ పండు వగరు, తియ్యగా, పుల్లగా ఉంటుంది. పండులో పోషక విలువలు ఎక్కువగా ఉంటాయి. నీరు 85.4శాతం, కాల్షియం 0.01, పిడి పదార్థాలు 9.5, పాస్పరస్ 0.2, మాంస కృతులు 0.4, ఇనుము 1.7, విటామిన్ ఎ 40ఐయు ఉంటుంది. ఆపిల్‌లో ఉండే ఇనుము, భాస్వరం మెదడుకు, శారీరానికి బలాన్ని ఇస్తుంది. పెక్టివ్ సూక్ష్మజీవులను నశింపజేస్తుంది. శరీరం నీరసంగా మారితే ఆపిల్ రసం వెంటనే బలాన్ని ఇస్తుంది. ఆలోచన శక్తిని పెంచుతుంది. మెదడుకు ఎంతో ఉపయోగ పడుతుంది. పొట్టలో గ్యాస్, గౌట్, అర్థ్రైటిస్ వ్యాధులకు ఎంతో మంచిది.

● పండ్లలో రాజు మామిడి..



పండ్లలో మామిడి రాజు వంటిది. బాగా పండిన మామిడిలో పిండి పదార్థాలు 12 గ్రామాలు, కాల్షియం మి.17, మాంసం కృతులు 0.6, పాస్పరస్ 20, కొవ్వు పదార్థాలు 0.1, ఇనుము 0.8, విటామిన్ ఎ 4,800 నుంచి 22,550ఐయు, పోటాషియం 250, విటామిన్ బి1 42,755, సోడియం 7, విటామిన్ బి2 50, నియాసిస్ 0.3, విటామిన్ సి 150గ్రాములు ఉంటాయి. వీటితోపాటు సిట్రిక్ యాసిడ్, గాలక్టోజ్‌పాంటోజ్ పిప్పి పదార్థాలు ఉంటాయి. దీని వల్ల మలబద్ధకం నివారణతోపాటు కాలేయం, పేగులు, చురుకుదనంగా పనిచేస్తాయి. మామిడికాయ పచ్చళ్లు ఎంతో ఉపయోగపడుతాయి.

● రక్తహీనతకు దానిమ్మ..



దానిమ్మ పండు రెండు రెకాలుగా ఉంటుంది. తియ్యటివి, పుల్లటివి. ఈ పండు తేలిగ్గా జీర్ణమవుతుంది. పండులో నీరు 78శాతం విటమిన్ సి 16ఎంజి, పిండి పదార్థాలు 14.5, కాల్షియం 0.01, మాంస కృతులు 1.7, పాస్పరస్ 0.7, ఇనుము 0.03 ఎంజి, విటామిన్ బి 10ఎంజి ఉంటుంది. గుండెపోటును, మల బద్ధకాన్ని నివారిస్తుంది. రక్తహీనతకు ఉపయోగపడుతుంది. జ్వరం వస్తే దానిమ్మ పండు ఎంతో ఉపయోగపడుతుంది.

● దాహార్తిని తీర్చే వాటర్‌మిలన్..



వేసవి రాగానే ఎక్కడ చూసిన కనిపించేది వాటర్ మిలన్(పుచ్చకాయ). ఎక్కువగా నీటితో ఉండే వాటర్ మిలన్ వేసవి దాహాన్ని తీర్చుతుంది. నీరు అధిక శాతం ఉండడంతో పాటు కాల్షియం, ఇనుము, సల్ఫర్, కాపర్‌లు ఎక్కువగా ఉంటాయి. రక్తహీనతను తగ్గించడంతో పాటు మలబద్ధకాన్ని దూరం చేస్తుంది. కడుపులో మంటను, మూత్ర సంబంధ వ్యాధులకు మంచిది.

● గ్యాస్‌ను దూరం చేసే పైనాపిల్..



పొట్టలో ఉత్పత్తి అయ్యే గ్యాస్‌ను దూరం చేయడంతోపాటు గుండె బలాన్ని పెంచేలా, మూత్రం సాఫీగా ఉండేలా పైనాపిల్ చూస్తుంది. పేగుల్లోని క్రిములను నాశనం చేస్తుంది. పైనాపిల్‌లో నీరు 86.5శాతం ఉంటే విటమిన్ సి, విటమిన్ ఎ, విటమిన్ బి, చక్కర, ఇనుము, మాంస కృతులు ఉంటాయి.

● వేడి తగ్గించే తర్బూజా..



వేసవిలో చల్లదాన్ని తర్బూజ అందిస్తుంది. వేసవిలో మాత్రమే ఎక్కువగా దొరికే అందరికి అందుబాటులో ఉంటుంది. తర్బూజాలో నీరు 95.9శాతం ఉంటే కాల్షియం, పిండి పదార్థాలు, పాస్పరస్, మాంస కృతులు, ఇనుము, సోడియంలు ఉంటాయి. ఒంట్లో వేడిని తీసి వేయడంతోపాటు మూత్ర సంబంధ వ్యాదులను తగ్గిస్తుంది. చర్మ వ్యాధుల నివారణకు ఉపయోగ పడుతుంది.

● అజీర్తిని తగ్గించే బత్తాయి..



వేసవిలో అజీర్తికి బత్తాయి ఎంతో ఉపయోగ పడుతుంది. వీటిలో విటామిన్ సి, ఇనుము, పోటాషియం, కాల్షియం, పాస్పరస్‌లు పొట్ట బాగాలను నివారిస్తుంది. ఆకలిని వృద్ధి చేస్తుంది.

● వేసవి దాహానికి కొబ్బరి బొండం..



వేసవి వేడిని తగ్గించడానికి కొబ్బరి బోండం ఎంతో ఉపయోగపడుతుంది. వేసవిలో ఎక్కువగా దొరికే కొబ్బరి బొండాలు చక్కర శాతం ఎక్కువగా ఉండడం వల్ల శరీరానికి శక్తినిస్తుంది. పిల్లలకు కూడా కొబ్బరి బొండాలు వేసవిలో ఆరోగ్యంగా ఉంచడానికి ఎంతో దోహద పడుతుంది.

● ఉష్ణోగ్రతను నియంత్రించే సపోటా..



శరీర ఉష్ణోగ్రత అధికంగా పెరగకుండా సపోట పండ్లు నియంత్రిస్తుంది. సపోటలో ఉండే కరోటిన్ కంటికి రక్షణగా నిలుస్తుంది. గ్లూకోజ్, విటామిన్ సి, కాల్షియం, క్లోరిన్, పీచు పదార్థాలు అధికంగా ఉండే సపోటాతో నీరసం తొలగించి శక్తి నిస్తుంది.




కొండంతా.. కాషాయమయం

● హనుమాన్ చిన్న జయంత్యుత్సవాలు షురూ
● కొండగట్టుకు తరలివస్తున్న దీక్షాపరులు
● నేడు చిన్న హనుమాన్ జయంతి



కొండగట్టుకు వస్తున్న హనుమాన్ దీక్షాపరులు

మల్యాల, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయ స్వామి సన్నిధిలో మూడు రోజుల పాటు జరిగే హనుమాన్ చిన్న జయంత్యుత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఉత్సవాల సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి దీక్షాపరులు కొండగట్టుకు తరలివస్తూ స్వామి వారిని దర్శించుకుని మాలవిరమణ చేస్తున్నారు. వేకువజామున వేలాదిగా భక్తులు అంజన్నకు మొక్కులు తీర్చుకున్నారు. జయంతి కోసం భక్తులు, అంజన్న దీక్షాపరులు వాహనాలు, కాలి నడకన కొండగట్టుకు తరలి వస్తున్నారు. కాగ శనివారం చిన్న జయంతి కోసం శుక్రవారం సాయంత్రం నుంచి భక్తుల రద్దీ పెరిగింది. వేలాదిగా భక్తులు, దీక్షపరులు కొండకు తరలివస్తున్నారు. దీంతో కొండంతా కాషాయయంగా మారింది. కలెక్టర్ సత్యప్రసాద్ కొండపై అధికారులతో కలసి ఏర్పాట్లు, సౌకర్యాలు పరిశీలిస్తూ పలు సూచనలు చేశారు. జయంతి ఉత్సవాల ప్రత్యేక అధికారి, శ్రీనివాసరావు, ఈవో శ్రీకాంత్‌రావు, డిఎస్పీ రఘుచందర్, సీఐ నీలం రవి తదితరులు నిరంతరం కొండపైన పర్యవేక్షిస్తున్నారు.



కొండగట్టులో హనుమాన్ దీక్షాపరులు

నేడు హనుమాన్ చిన్న జయంతి

ఆంజనేయ స్వామి సన్నిధిలో శనివారం హనుమాన్ చిన్న జయంతిని దేవస్థానం తరుపున నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఉత్తర భారతదేశంలో ప్రతియేటా చైత్ర పౌర్ణమి రోజున హనుమాన్ జయంతిని నిర్వహించనుండగా ఇక్కడ కూడా అదే రోజు నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. కాగా జయంతి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామి వారికి అభిషేకం, పట్టువస్త్రలంకరణ అలంకారం చేశారు. అర్చకులు ప్రత్యేక పూజలు చేయగా సాయంకాలం ఆలయ ఆవరణలో భక్తులు భజన కార్యక్రమాలు నిర్వహించారు.

● తండోపతండాలుగా భక్తులు

వివిధ ప్రాంతాల నుంచి తండోపతండాలుగా దీక్షాపరులు కొండగట్టుకు తరలివస్తుండడంతో కొండంతా కాషాయమయంగా మారింది. రామనామంతో అంజన్న సన్నిధి పులకిస్తోంది. అంజన్న దీక్షాపరులు హనుమాన్ జయంతి సందర్భంగా స్వామి వారి సన్నిధిలో మాల విరమణ చేయడం ఆనవాయితీ. దీంతో మాల విరమణ కోసం కల్యాణకట్టలో దీక్షావిరమణ మండపం ఏర్పాటు చేశారు. ఇందులోనే భక్తులు మాల విరమణ చేస్తున్నారు. కొండగట్టుకు వస్తున్న భక్తుల వాహనాలకు జెఎన్‌టీయూ మార్గంలోని బొజ్జ పోతన వద్ద పార్కింగ్ ఏర్పాటు చేయగా అక్కడి నుంచి ఆలయంకు వచ్చే భక్తుల కోసం ఆర్టీసీ ఉచిత బస్ సౌకర్యం ఏర్పాటు చేసింది. కాగా కొండపైన ఉత్సవాల కోసం వచ్చిన వివిధ శాఖల అధికారులు, సిబ్బంది సంఖ్యే అధికంగా కనిపిస్తుంది.



కొండగట్టులో కల్యాణ కట్ట వద్ద భక్తుల రద్దీ



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ సత్య ప్రసాద్

వైభవంగా ప్రారంభమైన రంగనాయక స్వామి బ్రహ్మోత్సవాలు



వాహనంపై ఊరేగుతున్న స్వామి వారు

సుల్తానాబాద్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ మండలంలోని నీరుకుళ్ల మానేరులో వెలసిన భూ,నీళాసమేత రంగనాయక స్వామి బ్రహ్మోత్సవాలు గురువారం రాత్రి అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. శుక్రవారం స్వామి వారిని శేషవాహనం పై ఊరేగించారు. మంగళవాయిద్యాలు భక్తజనసందోహం మధ్యన భక్తిగీతాలు ఆలపిస్తుండగా భూనీళా సమేతుడైన రంగనాయకుల శోభాయాత్ర నిర్వహించారు. ఆలయ బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం శేషవాహన సేవలు కొనసాగగా, శనివారం పొన్నసేవ, ఆదివారం గరుడవాహన సేవలు జరగనున్నాయి. సోమవారం డోపుకథతోపాటు బండ్లు తిరిగే కార్యక్రమం వైభవంగా చేస్తారు. చుట్టు పక్క గ్రామాల రైతులు ఎడ్లబండ్లతో ఆలయం చుట్టూ తిరుగుతారు. మంగళవారం హంస వాహన సేవ, తెప్పోత్సవం, రాత్రి డోలోత్సవం ఉంటుంది. బ్రహ్మోత్సవాల ముగింపులో భాగంగా రథోత్సవం ఈనెల 17న తెల్లవారుజామున ప్రారంభమువుతుంది.

రథోత్సవానికి వివిధ జిల్లాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకొని మొక్కులు చెల్లిస్తారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేసినట్లు ఆలయ అర్చకులు గోవర్ధన గిరి మనోహరాచార్యులు, ఆచార్య రాజ్‌కుమార్ తెలిపారు.

ఎస్‌యూ పీహెచ్‌డీ ప్రవేశఫలితాలు విడుదల



ఫలితాలను విడుదల చేస్తున్న వీసీ, రిజిస్ట్రార్

గణేశ్‌నగర్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయ పరిపాలన భవనంలో వీసీ ప్రొఫెసర్ ఉమేష్ కుమార్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రవికుమార్ జాస్తి పీహెచ్డీ ప్రవేశ ఫలితాలను శుక్రవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఉమేష్ కుమార్ మాట్లాడుతూ నాలుగు ఫ్యాకల్టీ విభాగాల్లో ఫలితాలను విడుదల చేశామని, విశ్వవిద్యాలయంలో పరిశోధన మరింత ముందుకెళ్తుందని అన్నారు. ఇది విశ్వవిద్యాలయ అభివృద్ధికి అవసరమన్నారు. కార్యక్రమంలో పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ సురేష్‌కుమార్, సోషల్ సైన్స్‌డీన్ ఆచార్య సుజాత, ఓఎస్డీటు వీసీ హరికాంత్, అదనపుపరీక్షల నియంత్రణ అధికారి అబ్రారూల్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక డంపులు స్వాధీనం

వెల్గటూర్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ఎండపల్లి మండలం సూరారం గ్రామ శివారులో అక్రమంగా నిల్వ చేసిన ఇసుక డంపులను శుక్రవారం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై ఉమాసాగర్, ఆర్ఐ రాజేశ్వరి తెలిపారు. సూరారంలో అక్రమ ఇసుక నిల్వ చేశారనే సమాచారం మేరకు వెల్గటూర్ పోలీసులు, రెవెన్యూ, మైనింగ్ అధికారులతో తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో సుమారు 8నుంచి 10ట్రిప్పుల ఇసుకను అక్రమంగా నిల్వ చేశారని నిర్ధారణ కావడంతో ఇసుకను పంచనామా నిర్వహించి స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

దుష్ప్రచారాన్ని నిలిపివేయాలి..

● నేరెళ్ల ఘటనపై ఎస్సీ కమిషన్‌ను తప్పు పడుతారా?
● చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరిక

సిరిసిల్ల, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం నేరెళ్లలో 2017లో ఇసుక లారీ ఢీకొని ఒకరు మృతిచెందగా, ఆసంఘటనలో దళితులు, ఇతరులపై జరిగిన వేధింపులపై ఎస్సీ కమిషన్ విచారణ జరిపింది. ఇటీవల కొంతమంది నేరెళ్ల ఘటనలో సోషల్ మీడియా వేదికగా జాతీయ ఎస్సీ కమిషన్‌ను బద్నాం చేస్తున్నట్లు సమాచారం అందుకున్న కమిషన్ సభ్యుడు వడ్డెపల్లి రామచందర్ అంశాన్ని తీవ్రంగా పరిగణించారు. దళితుల పక్షాన పనిచేసే కమిషన్‌ను నిందించడాన్ని ఆయన తప్పు బట్టారు. తక్షణమే దుష్ప్రచారాన్ని నిలిపివేయాలని కోరారు. లేని పక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నేరెళ్ల ఘటనలో ఎస్సీ కమిషన్ జరిపిన విచారణతో పాటు రాష్ట్ర ప్రభుత్వానికి మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశామని, బాధితులకు న్యాయం జరిగేలా బాధ్యులపై చర్యలు తీసుకునేలా ఆదేశాలు జారీ చేశామని పేర్కొన్నారు.

2017 జూలైలో రాజన్న సిరిసిల్ల జిల్లా నేరెళ్ల గ్రామంలో ఎస్సీ కమిషన్ పర్యటించి బహిరంగ విచారణ జరిపింది. ఆ విచారణలో భాగంగా ఎస్సీ కమిషన్ కరీంనగర్ జైలుకు వెళ్లి నేరెళ్ల బాధితులను కలిసి వారి స్టేట్‌మెంట్ రికార్డు చేసింది. కలెక్టర్, పోలీస్ అధికారులను విచారణ జరిపి స్టేట్‌మెంట్ రికార్డు చేసింది. అదే సంవత్సరం ఆగస్టు 7న అప్పటి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి మధ్యంతర నివేదికను పంపిస్తూ చర్యలు తీసుకోవాలని కమిషన్ ఆదేశించింది.

మహనీయుల విగ్రహాలను సుందరీకరించాలి

సిరిసిల్ల టౌన్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : మహనీయులు డాక్టర్ బీఆర్ అంబేద్కర్, బాబు జగ్జీవన్‌రామ్, జ్యోతిరావు పూలే జయంతి వర్ధంతీల సందర్భంగా వారి విగ్రహాలను అధికారులు సుందరీకరించాలని మాల మహానాడు జాతీయ కార్యదర్శి రాగుల రాములు అన్నారు. శుక్రవారం సిరిసిల్ల పట్టణం ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణుతో కలసి రాములు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మార్చి నెలలో కలెక్టర్ ఆధ్వర్యంలో దళిత సంఘాల నాయకులతో జరిగిన సమావేశంలో మహనీయుల జయంతి, వర్ధంతీలను పురస్కరించుకొని జిల్లాలోని మహనీయుల విగ్రహాలను సుందరీకరించాలని అధికారులను ఆదేశించారన్నారు. ఇప్పటివరకు చాలా ప్రాంతాలలో మహనీయుల విగ్రహాలకు రంగులు వేయలేదని తెలిసిందని, అంటువంటివి ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఈనెల 14న అంబేద్కర్ జయంతికి సంబంధించిన ఏర్పాట్లు జిల్లాలో ఎక్కడా కనిపించడం లేదన్నారు. జిల్లా కేంద్రంలో వేములవాడలో అంబేద్కర్ విగ్రహానికి కూడా ఇప్పటి వరకు రంగులు వేయలేదని మున్సిపల్ కమిషనర్లతో మాట్లాడామన్నారు. జిల్లాలోని గ్రామాల్లో అంబేద్కర్ విగ్రహాలకు రంగులు వేయకున్నా, ఏదైనా లోటుపాట్లు జరిగినా పంచాయతీ కార్యదర్శి బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. మహనీయల విగ్రహాలను ధ్వంసం చేస్తున్న అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పిర్యాదు చేస్తామన్నారు. సమావేశంలో దళిత నాయకుడు వంకాయల భూమయ్య పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర

ముస్తాబాద్, (గంభీరావుపేట) ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : ముస్తాబాద్ మండలం చికోడు, నామపూర్ గ్రామాల్లో శుక్రవారం రాజ్యాంగ పరిరక్షణ యాత్ర నిర్వహించారు. గ్రామాల్లో పార్టీ జెండాను ఆవిష్కరించి ప్రతిజ్ఞ చేయించారు. మండలకాంగ్రెస్ అధ్యక్షుడు బాల్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ నాగం కుమార్, గ్రామ శాఖ అధ్యక్షుడు గన్నె భాను, కాంగ్రెస్ నాయకులు, యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యుఐ నాయకులు పాల్గొన్నారు.

సంక్షేమానికి ప్రాధాన్యం..

(5వ పేజీ తరువాయి)

జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ, సిరిసిల్ల మార్కెట్ కమిటీ చైర్మన్ వెల్ముల స్వరూపరెడ్డి, టెక్స్‌టైల్ జడీ వెంకటేశ్వర్లు, జీఎం అశోక్‌రావు, ఏడీ రాఘవరావు, అదనపు ఎస్పీ చంద్రయ్య, కాంగ్రెస్ నాయకులు చొప్పదండి ప్రకాష్, చీటి ఉమేష్‌రావు, సంగీతం శ్రీనివాస్, గడ్డం నరసయ్య, శ్రీనాథ్, గోలి వెంకటరమణ, కాముని వనిత, ఆకునూరు బాలరాజు, మడుపు శ్రీదేవి, ఆడేపు చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

చైతన్యవంతమైన సిరిసిల్ల..

- పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు



సిరిసిల్ల ఎంతో చైతన్యవంతమైందని, నేతన్నకు నిలయమై, రైతన్నకు తోడుగా వివిధ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. సిరిసిల్ల ప్రాంతానికి చెందిన డాక్టర్ సి నారాయణరెడ్డి, కమ్యూనిస్ట్ నాయకులు సీహెచ్ రాజేశ్వర్‌రావు వంటి మహనీయులు ఎందరో ఉన్నారన్నారు. ప్రముఖ దేవస్థానాల్లో ఒకటైన వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి ఆశీస్సులకు దేశ వ్యాప్తంగా ప్రజలు వస్తారన్నారు. నేతన్నలను కాపాడుకోవడానికి కృషి చేస్తున్నామని, నేత కార్మికులకు అంత్యోదయ కార్డులు గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. సంక్షేమ పథకాలు, కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అందించామన్నారు. గత పదేండ్లలో ప్రభుత్వం కార్మికుల్లో ఆత్మస్థైర్యం అందించలేకపోయిందన్నారు. వేములవాడ దేవాలయ అభివృద్ధికి బడ్జెట్‌లో ప్రత్యేకంగా నిధులు కేటాయించామన్నారు. శాతవాహన యూనివర్సిటీని ఉమ్మడి కరీంనగర్ కోసం 200ఎకరాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిందని, గత ప్రభుత్వం పట్టించుకోలేదని, ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తరువాత లా, కాలేజీ, ఇంజనీరింగ్ కాలేజీలు ఇచ్చిందన్నారు. అన్ని రంగాల్లో దేశంలోనే తెలంగాణ రాష్ట్రాన్ని ముందు వరుసలో ఉంచుతామన్నారు. ఉపాధి అవకాశాలు కల్పించే ఎటువంటి పరిశ్రమలకైనా ఎలాంటి అవసరం ఉన్నా ప్రభుత్వం పూర్తిగా సహకరిస్తుందన్నారు.

వర్కర్ టు ఓనర్ పథకంపై కార్యాచరణ

- బీసీ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



సిరిసిల్లలో వర్కర్ టు ఓనర్ పథకంపై కార్యాచరణ తో ముందుకు తీసుకవెళతామని బీసీ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సిరిసిల్లలో చేనేత రంగంలో విపత్కరమైన పరిస్థితులు వచ్చిన సమయంలో వైఎస్ ప్రభుత్వ హయాంలో మహిళా సంఘాలకు రూ.5లక్షల రుణాలు, కుటుంబాలకు 12వేల అంత్యోదయ కార్డులు అందించామని అన్నారు. ఆత్మహత్యలు జరగకుండా ఆత్మస్థైర్యాన్ని నింపే దిశగా ర్యాలీలు నిర్వహించి నేతన్నకు అండగా ఉన్నామనే భరోసా కల్పించామన్నారు. పేదల సంక్షేమం కోసం ప్రభుత్వం సన్నబియ్యం పథకాన్ని అందిస్తున్నామన్నారు. సన్నబియ్యం కేంద్ర ప్రభుత్వానివని అంటూ మోదీ ఫొటో పెట్టాలని కొందరు మాట్లాడుతున్నారని, బీజేపీ పాలనలో ఉన్న రాష్ట్రాల్లో ఎక్కడైనా సన్నబియ్యం ఇస్తున్నారా అని ప్రశ్నించారు. ఫొటో గురించి కాదని చేతనైతే చేనేత రంగంపై వేసిన జీఎస్టీని తొలగించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వివిధ శాఖలకు అవసరమైన బట్టలను నేత కార్మికుల నుంచి సేకరిస్తున్నామని మహిళా సంఘాలకు ప్రభుత్వం రెండు చీరలు ఇవ్వాలని నిర్ణయించి సిరిసిల్ల నేతన్నలకే ప్రభుత్వం ఆర్డర్లు ఇచ్చిందని అన్నారు. సిరిసిల్ల అపెరల్ పార్కులో టెక్స్‌పోర్టు సంస్థ రూ 62 కోట్లతో యూనిట్ ఏర్పాటు చేయడం చాలా సంతోషమని, భవిష్యత్తులో పరిశ్రమలను విస్తరిస్తామని అవసరమైన సహకారాన్ని అందిస్తామన్నారు.

65 లక్షల మంది మహిళలకు చీరలు..

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



నేత కార్మికులకు రూ.లక్ష రుణమాఫీ పూర్తి చేశామని, మహిళా సంఘాల్లో ఉన్న 65 లక్షల మంది మహిళలకు ఉచితంగా రెండు చీరలు పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. చీరల ఉత్పత్తికి సంబంధించిన ఆర్డర్లు ఇచ్చామని, ప్రభుత్వం చేనేత కార్మికుల ఉపాధి కల్పన దిశగా చర్యలు తీసుకుంటోందన్నారు. సిరిసిల్ల ప్రాంతంలో కాటన్, పాలిస్టర్ అనుబంధ రంగ పరిశ్రమలు తీసుకరావాలని, ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేయాలని కోరారు. సిరిసిల్ల కార్మికుల చిరకాల కోరిక యారన్ డిపోను రూ.50 కోట్లతో వేములవాడలో ఏర్పాటు చేసుకున్నామన్నారు.

దీనిద్వారా ఇప్పటికే 99సంఘాలకు సబ్సిడీపై నూలు అందించామని అన్నారు.

వక్ఫ్ బిల్లును రద్దు చేయాలి

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన వక్ఫ్ బిల్లును రద్దు చేయాలని ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని జామా మజీద్‌లో ప్రార్థనల అనంతరం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. పార్లమెంటులో ఆమోదం పొందిన వక్ఫ్ బిల్లు రాజ్యాంగ విరుద్ధమని అన్నారు. బీజేపీ ప్రభుత్వం ముస్లిం మతానికి వ్యతిరేకంగా చట్టాలు చేపడుతోందని ఆరోపించారు. ఇప్పటికైనా బిల్లును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మజీద్ కమిటీ అధ్యక్షుడు జహంగీర్, లాల్‌మహ్మద్, బాబా, హైమద్, జాఫర్ షరీఫ్, ఖాదర్, ముజఫర్, మజీదర్, ఇర్ఫాన్ తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న ముస్లింలు

వీర్నపల్లివాసికి డాక్టరేట్

వీర్నపల్లి, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : మండలకేంద్రానికి చెందిన సామల్ల కృష్ణ డాక్టరేట్ పొందారు. సామల్ల హన్మయ్య-సావిత్రి కుమారుడు కృష్ణ డాక్టర్ పెరుమాళ్ల నవీన్ కుమార్ ఆధ్వర్యంలో ఎలక్ట్రానిక్స్‌అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్‌లో స్పూఫింగ్ మాఫియాపైన పరిశోధన చేశారు.దీంతో ఆయనకు ఉస్మానియాయూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది.

మహనీయుల ఆశయ సాధనకు కృషి

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



చందుర్తిలో నివాళులర్పిస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

చందుర్తి,ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) మహనీయుల ఆశయ సాధనకు కృషి చేస్తున్నామని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. చందుర్తి మండల కేంద్రంలో జ్యోతిరావు పులే జయంతి వేడుకల్లో పాల్గొని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ విగ్రహానికి పూలమాల వేసి, ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ మహనీయుల ఆశయ సాధనకు పాటుపడదామన్నారు. నేటి యువత మహనీయుల జీవితాలను తెలుసుకొని నిత్య జీవితంలో ముందుకు సాగలాన్నారు. ప్రజా ప్రభుత్వంలో అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా ముందుకు పోతున్నమన్నారు. సావిత్రి బాపులె, జ్యోతిరావు పూలే విద్య ఆవశ్యకతను గుర్తించి ఆ రోజుల్లోనే అనేక మందికి విద్య దానం చేశారని తెలిపారు. వారు సమాజంలో అంటరాని తనాన్ని రూపుమాపడానికి ఎంతో కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చింతపంటి రామస్వామి, రుద్రంగి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బొజ్జ మల్లేశం, నాయకులు గొట్టే ప్రభాకర్, పులి సత్తయ్య, ఎన్గంటి శంకర్ దూది శ్రీనివాసరెడ్డి సొంతపూరి బాలకృష్ణమధు, శంకర్, ప్రసాద్, దేవస్వామి, దేవరాజు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణం

వీర్నపల్లి, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : వీర్నపల్లి మండలం అడవిపదిర గ్రామంలో శివపార్వతుల కల్యాణం శుక్రవారం కనుల పండువగా నిర్వహించారు. మనోకామేశ్వర ఆలయంలో వేద పండితులు అరుణ్ శర్మ స్వామివారి కల్యాణం అంగ రంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు తలంబ్రాలను తీసుకొచ్చారు. దేవాలయం శివనామస్మరణతో మార్మోగింది. స్వామివారి కల్యాణానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. భక్తులకు కొమ్ము జలపతి - అంజలి దంపతులు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సెస్ డైరెక్టర్ మాడుగుల మల్లేశం, బంజార సంఘం జిల్లా అధ్యక్షుడు సురేష్ నాయక్, మాజీ సర్పంచ్ ఎడ్ల సాగర్, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గుజ్జుల రాజిరెడ్డి స్వామివారిని దర్శించుకున్నారు. పూజా కార్యక్రమాల్లో గ్రామస్తులు తిరుపతి రెడ్డి, భాస్కర్, బాజిరెడ్డి రాజు, కొమ్ము శ్రీను, జలపతి, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

దహన సంస్కారాలకు విరాళం

ఇల్లంతకుంట, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దలింగాపూర్‌కు చెందిన కీర్తి రాజు అనే నిరుపేద మృతిచెందగా దహన సంస్కారాల కోసం కాంగ్రెస్ నాయకుడు కేతిరెడ్డి నవీన్‌రెడ్డి శుక్రవారం రూ.5వేలు అందించాడు. వేణు కొంతకాలంగా కిడ్నీల సమస్యతో బాధపడుతున్నాడు. ప్రభుత్వం రూ.2.5లక్షల ఎల్ఓసీ సైతం ఇచ్చింది.

కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడికి సన్మానం

ఇల్లంతకుంట, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడుగా నియామకం అయిన కోమటిరెడ్డి భాస్కర్‌రెడ్డి, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు వెలిచాల జ్యోతిలను నాయకులు శుక్రవారం ఘనంగా సత్కరించారు. జంగమరెడ్డిపల్లె గ్రామంలోని శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో సన్మానం జరిగింది. కార్యక్రమంలో నాయకులు మంద పెద్దబాల్‌రెడ్డి, తూముకుంట రాజేందర్‌రెడ్డి, గూడ నరేందర్‌రెడ్డి, పసునూటి రవి, సత్తిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చికిత్స కోసం ఆర్థిక సాయం

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం దుమాలలో క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న ఆశా కార్యకర్త లత వైద్య చికిత్స కోసం దాతలు సమకూర్చిన రూ 56300 నగదును శుక్రవారం అందజేశారు. గత కొంతకాలంగా వ్యాధితో బాధపడుతున్న లత కుటుంబ దీన పరిస్థితిని చూసి చలించిన స్థానికులు నగదును పోగుచేశారు. ప్రభుత్వం మెరుగైన వైద్యం అందించి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో తాజా, మాజీ సర్పంచ్ రజిత, తాజా, మాజీ ఉపసర్పంచ్ హనుమంతు, పంచాయతీ కార్యదర్శి మహేందర్, నాయకులు బాలకిషన్, బాలయ్య, చంద్రయ్య, ప్రసాద్, శరవింద్, ఆంజనేయులు, గోపాల్, రాజు, శ్రీనివాస్, బాబు, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుల పరామర్శలు

తంగళ్లపల్లి, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): తంగళ్ళపల్లి మండలం బద్దనపల్లి గ్రామానికి చెందిన మాజీ జిల్లా రెడ్డి సంఘం అధ్యక్షుడు కూర అంజిరెడ్డిని జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు తోట ఆగయ్య, నాయకులు పరామర్శించారు. అలాగే కస్బెకట్కూర్ గ్రామంలో అనారోగ్యంతో ఇటీవల మృతిచెందిన బీఆర్ఎస్ యువ నాయకుడి కుటుంబాన్ని పరామర్శించారు. బొల్లి రామ్మోహన్, గజభీంకర్ రాజన్న, మాట్ల మధు, వలకొండ వేణుగోపాలరావు, గుగ్గిళ్ళ అంజయ్య, చిలువేరి నర్సయ్య, చిలువేరి చిరంజీవి, అవునూరు వెంకట రాములు, అమర్‌రావు, చిలువేరి శ్రీనివాస్, కర్నే బాలయ్య, గొడిసెల ఎల్లయ్య, మాజీ ఎంపీటీసీ శ్రీవర్ధన్, శ్రీనివాస్‌రావు, జూపెల్లి అజయ్‌రావు, సేనిగరం తిరుపతి, దాచారం శ్రీనివాస్, మాడూరి చందు, బెల్లా శేఖర్, బొమ్మరాం శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

సీతారాముల ఆలయంలో ఎడ్లబండ్ల ప్రదక్షిణ

కోనరావుపేట, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : కోనరావుపేట మండలం మామిడిపల్లి శ్రీసీతారాముల ఆలయంలో శుక్రవారం రైతులు, ట్రాక్టర్లు, ఎడ్ల బండ్లతో ప్రదక్షిణ చేసి స్వామివారిని దర్శించుకున్నారు. ప్రతి సంవత్సరం శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల్లో భాగంగా రైతులు ఎడ్లబండ్లతో రామాలయం వద్ద ప్రదక్షిణ చేసి పాడిపంటలు బాగుండాలని వేడుకుంటారు. ఇందులో భాగంగానే స్వామి వారిని ఎడ్లబండతో వచ్చి దర్శించుకున్నారు.

హనుమాన్ భక్తులకు సత్కారం

కోనరావుపేట, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బావుసాయిపేటలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఫిరోజ్ బాషా ఆధ్వర్యంలో హనుమాన్ భక్తులకు సత్కారం చేసి భిక్షను అందజేశారు.

నేడు హనుమాన్ జయంతి వేడుకలు

వేములవాడ రూరల్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీరాజరాజేశ్వర స్వామి ఆలయంలో శనివారం హనుమాన్ జయంతి వేడుకలు నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. రాజరాజేశ్వరస్వామి ఆలయంతో పాటు స్వామివారి అనుబంధ దేవాలయాల్లోని హనుమాన్ మండపాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. భీమేశ్వరస్వామి ఆలయంలోని హనుమాన్ మండపంలో స్వామివారికి ఉదయం శ్రీమన్యు సూక్తం, పంచసూక్తం, దశ శాంతి వేద మంత్రాలతో మహాఅభిషేకం నిర్వహించిన అనంతరం చందన లేపనం, అష్ట శత నామార్చన నిర్వహించి అర్చన నిర్వహించనున్నట్లు అర్చకులు తెలిపారు.

అయ్యప్పస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం అల్మాస్‌పూర్‌లోని అయ్యప్పస్వామి ఆలయ వార్షికోత్సవం, స్వామివారి జన్మ నక్షత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు మంగళహారతులు సమర్పించి దర్శించుకున్నారు. శ్రీనివాస్, ఇంద్రారెడ్డి, అభినయ్, వినోద్, మల్లారెడ్డి, మోహన్‌రెడ్డి, వీరాచారి, అనిల్, మధు, శంకర్, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

ఇల్లంతకుంటలో..

ఇల్లంతకుంట, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని అయ్యప్ప స్వామి ఆలయంలో ఉత్తర నక్షత్రంను పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గణపతి హోమం, అష్టాభిషేకం, పూలాభిషేకం, భజనకీర్తనలు నిర్వహించారు. వివిధ గ్రామాల భక్తులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. గోపాలచారి, రఘు, భూపతి, రవీందర్‌రెడ్డి, చక్రాదర్‌రెడ్డి, బాలరాజు, ఎల్లారెడ్డి, మోహన్‌రెడ్డి, వేణు, వెంకన్న, సుధాకర్, శ్రీకాంత్, యాదగిరి పాల్గొన్నారు.

సామాజిక ఉద్యమ పితామహుడు పూలే..



సిరిసిల్లలో నివాళులర్పిస్తున్న బీసీ సంక్షేమ సంఘం నాయకులు



బీజేపీ జిల్లా కార్యాలయంలో..

సిరిసిల్ల టౌన్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) తొలి సామాజిక ఉద్యమ పితామహుడు మహాత్మ జ్యోతిబాపూలేనని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్శ హన్మాండ్లు అన్నారు. శుక్రవారం సిరిసిల్ల పట్టణం బీసీ భవన్‌లో మహాత్మ జ్యోతిబాపూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మహాత్మ జ్యోతిబాపూలే చిత్రపటానికి నాయకులు పూలతో నివాళురల్పించారు. అనంతరం స్వీట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు తడక కమలాకర్, నాయకులు బచ్చు ప్రసాద్, తిరుపతి, రవి, శ్రీకాంత్, వేణు పాల్గొన్నారు.

● సిరిసిల్ల రూరల్ : బలహీన వర్గాల ఆశాజ్యోతి జ్యోతిరావుపూలే అని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి జంగిటి రాజు అన్నారు. సిరిసిల్ల పట్టణం శివనగర్‌లోని కుసుమ రామయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం మహాత్మాజ్యోతిరావుపూలే జయంతి వేడుకలను వారి విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నిర్వహించారు. జిల్లా ఉపాధ్యక్షులు మహేందర్‌రావు, కోశాధికారి అంబటి రమేష్, జిల్లా కార్యదర్శులు పాముల స్వామి, అడెపు శివకుమార్, కోటగిరి లక్ష్మణ్, పోలాస మల్లేశం, గాలిపెల్లి సంతోష్, చేరాల ప్రభాకర్ పాల్గొన్నారు. సిరిసిల్ల పట్టణంలో సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పట్టణం బీవైనగర్‌లోని అమృత్‌లాల్ శుక్లా కార్మిక భవనంలో శుక్రవారం జ్యోతిరావుపూలే చిత్రపటాలకు పూలమాలు వేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి మూషం రమేష్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కోడం రమణ, జిల్లా కమిటి సభ్యులు సూరం పద్మ, ఎలిగేటి రాజశేఖర్, మిట్టపల్లి రాజమల్లు, నక్క దేవదాస్, బెజుగ్గం సురేష్, కోడం శేఖర్ తదితరులు పాల్గొన్నారు. సిరిసిల్ల పట్టణంలోని భారతీయ జనతాపార్టీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం బీజేపీ ఓబీజీ మోర్చా జిల్లా అధ్యక్షుడు నంద్యాడపు వెంకటేష్, బీజేపీ పట్టణ అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్‌ల ఆధ్వర్యంలో మహాత్మా జ్యోతిరావుపూలే జయంతి నిర్వహించారు. జ్యోతిరావుపూలే చిత్రపటానికి పూలమాలలు వేశారు. కరీంనగర్ పార్లమెంట రీ కో-కన్వీనర్ అడెపు రవీందర్, జిల్లా ఉపాధ్యక్షుడు శీలంరాజు, పట్టణ ఉపాధ్యక్షుడు గాజుల సదానందం, దూడం శివప్రసాద్, కర్నే రేవంత్, సిరిసిల్ల వంశీ, సుధాకర్, వేముల సురేష్, రాజ్‌కుమార్, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా సాహితి సమితి అధ్వర్యంలో...

సిరిసిల్ల జిల్లా కేంద్రంలో శుక్రవారం జిల్లా సాహితి సమితి అధ్వర్యంలో మహాత్మా జ్యోతిరావుపూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. జిల్లా సాహితి సమితి జిల్లా అధ్యక్షుడు జనుపాల శంకరయ్య ఆధ్వర్యంలో జ్యోతిరావుపూలే చిత్రపటానికి పూలమాలు వేసి నివాళ్లు అర్పించారు. ప్రధాన కార్యదర్శి వెంగళ లక్ష్మణ్, రచయతల వేదిక జాతీయ అధ్యక్షుడు జూకంటి జగన్నాథం, జిల్లా గంథ్రాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు అకునూరి శంకరయ్య, సీసా సహ అధ్యక్షుడు కోడం నారాయణ, సిరిసిల్ల సీనియర్ సిటిజన్ అధ్యక్షుడు చేపూరి బుచ్చయ్య, శ్రీగాధ షైనయ్య, గుండెల్లి వంశీ, ఎండి అఫీజ్, గజ్జెల్లి సత్యనారాయణ, అంకారపు రవి, సిరిసిల్ల తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

సిరిసిల్ల పట్టణంశివనగర్‌లోని కుసుమ రామయ్య జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో శుక్రవారం మహాత్మాజ్యోతిరావుపూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు లకావత్ మోతీలాల్, ఉపాధ్యాయులు రవీందర్, మహేందర్‌రెడ్డి, గోవిందరావు, హాజ్‌నాయక్, కుమ్మరి మల్లేశం, శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, దేవత ప్రభాకర్, సాంబయ్య, నసీరుద్దీన్, ఇజాజ్, ఫాతిమా, మంజులత, సంధారాణి, సంతోష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● ఇల్లంతకుంట : జ్యోతిబా పూలే జయంతి వేడుకలు మండలంలో ఘనంగా జరిగాయి. పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కాంగ్రెస్ మండలశాఖ అధ్యక్షుడు కోమటిరెడ్డి భాస్కర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ అయిలయ్య, మాజీ సర్పంచ్‌లు పోతరాజు పర్శరాం, జితేందర్‌గౌడ్, భాస్కర్‌రావు, నాయకులు మహేందర్‌రెడ్డి, ప్రసాద్, కేతిరెడ్డి నవీన్‌రెడ్డి, కర్ణాకర్‌రెడ్డి, పసుల వెంకటి, బెంద్రం తిరుపతిరెడ్డి, సావనపెల్లి రాకేష్, గన్నారం నర్సయ్య, గుండ్రెడ్డి రాజు, మ్యాకల మల్లేశం, ఏనుగుల లింగన్న, ముత్త వ్వ, సావనపెల్లి శంకర్, నాగరాజు, బాబు, వీరేశం, మచ్చ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

● గంభీరావుపేట : గంభీరావుపేట మండలం ముస్తాఫనగర్‌లో జ్యోతిబా పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. సిరిసిల్ల జిల్లా ముదిరాజ్ సంఘం ఉపాధ్యాక్షుడు శివంది దేవందర్ ఆధ్వర్యంలో జ్యోతిరావుపూల చిత్ర పఠానికి పూల మాలలు వేశారు. నాయకులు నారాయణ, విఠల్, ప్రసాద్, సంజీవ్, నవీన్, దేవయ్య, కిషన్ తదితరులు ఉన్నారు..


● ముస్తాబాద్: ముస్తాబాద్ మండల కేంద్రంలో మహాత్మ జ్యోతిరావు పూలే 198వ జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం యూత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శీలం స్వామి, నాయకులు మొంగని మనోహర్, పిట్ట రాంగోల్, కంచం నర్సింలు, జాల బిక్షపతి, జాహంగీర్, విశ్వనాథం, అనిల్, శ్రీనివాస్, శ్రీకాంత్, నరేంద్ర, సామికృష్ణ, దేవయ్య తదితరులు ఉన్నారు.

● ఎల్లారెడ్డిపేట : ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో వేడుకలను నిర్వహించారు. మండల కేంద్రంలోని తాజా, మాజీ జడ్పీటీసీ లక్ష్మణ్‌రావు కార్యాలయంలో జ్యోతిరావు పూలే చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● తంగళ్లపల్లి : తంగళ్ళపల్లి మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మహాత్మా జ్యోతిబా పూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జలగం ప్రవీణ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నేరెళ్ల నర్సింగం గౌడ్, నాయకులు లింగాల భూపతి, భైరినేని రాము, పెద్దూరి తిరుపతి, ఆసాని సత్యనారాయణ రెడ్డి, పొన్నం లక్ష్మణ్, ఇటుకల మహేందర్, బండి పర్శరాం, మోర కిరణ్, కందుకూరి మనోజ్, కొడం శ్రీను, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, తదితరులు పాల్గొన్నారు.

మండల కేంద్రంలో బీఆర్ఎస్ కార్యాలయంలో మండల అధ్యక్షుడు గజభీంకర్ రాజన్న ఆధ్వర్యంలో మహాత్మా జ్యోతిబాపూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రధానకార్యదర్శి బండి దేవేందర్ యాదవ్, ఉపాధ్యక్షుడు తిరునహరి భానుమూర్తి, జాగృతి యువజన విభాగం ప్రధానకార్యదర్శి నేరెళ్ల అనిల్‌గౌడ్, నాయకులు జంగపల్లి బిక్షపతి, బండి జగన్, పరకపెల్లి తిరుపతి, గాలిపల్లి బలరాం తదితరులు పాల్గొన్నారు.


● చందుర్తి : మండల కేంద్రంతో పాటు ఎన్గల్, సనుగుల తదితర గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో పూలే జయంతి నిర్వహించారు. మండల రైతు సంఘం అధ్యక్షుడు ఎంపీపీ చిలుక పెంటయ్య, సంటి బాపురావు, వరికెల బాబురావు, మర్రి రాములు, సుద్దాల నర్సయ్య, ఉపాధ్యాయులు సుజాత, ముఖేష్, శ్రీనివాస్, నాగమణి, మాధవి, నవ్య, నరేష్, బాలకృష్ణ, రవి, లక్ష్మీనారాయణ, కృష్ణరెడ్డి, కృష్ణ చైతన్య, చైతన్యగౌడ్, కవిత, తిరుపతి, శ్రీలత, అనిత తదితరులు పాల్గొన్నారు.



సిరిసిల్ల కుసుమ రామయ్య పాఠశాలలో..

వైభవంగా పెద్దమ్మ-పెద్దిరాజుల కల్యాణం

గంభీరావుపేట, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం పెద్దమ్మ-పెద్దిరాజుల కల్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. అనంతరం అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కల్యాణ మహోత్సవంలో భాగంగా గ్రామ దేవతలకు బోనాలు తీశారు. ముదిరాజ్‌లు ప్రతి ఇంటి నుంచి బోనాలను గ్రామప్రధాన రహదారుల వెంట ఆలయం వరకు తీసుకవచ్చి అమ్మవారికి సమర్పించారు. ఉత్సవాల సందర్భంగా ఆలయం వద్ద జాతర ఏర్పాటైంది. పెద్దఎత్తున ముదిరాజులు, గ్రామస్థులు విచ్చేసి, అమ్మవారిని దర్శించుకుని, కట్నకానులకు సమర్పించారు.



పెద్దమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న కేకే మహేందర్‌రెడ్డి

కాగా, గంభీరావుపేట మండల కేంద్రంలోని పెద్దమ్మ ఆలయంలో సిరిసిల్ల నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జీ కేకే మహేందర్‌రెడ్డి శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. పెద్దమ్మ-పెద్దిరాజుల కళ్యాణ మహోత్సవం సందర్భంగా కేకే మహేందర్‌రెడ్డి పెద్దమ్మ ఆలయంలో అమ్మవారిని దర్శించుకున్నారు. వెంట మండల కాంగ్రెస్ అధ్యక్షుడు హమీద్, బీసీ సంక్షేమ సంఘం అధికార ప్రతినిధి పర్శ హన్మండ్లు, జిల్లా ఉపాధ్యక్షుడు కొమిరిశెట్టి తిరుపతి, పట్టణ అధ్యక్షుడు పాపగారి రాజు, సోషల్ మీడియా ఇంచార్జీ గౌరిశంకర్, నాయకులు అక్కపల్లి బాలయ్య, లింగం, రాజశేఖర్ ఉన్నారు.

● ఎల్లారెడ్డిపేట : ఎల్లారెడ్డిపేట మండలం హరిదాస్‌నగర్‌లో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో పెద్దమ్మపెద్దిరాజుల సిద్ధోగం వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. పెద్దమ్మ పెద్దిరాజుల కల్యాణ మహోత్సవాన్ని కన్నుల పండువగా జరిపించారు. మహిళలు బోనాలు తీసి అమ్మవారికి సమర్పించారు. కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జీ కేకే మహేందర్‌రెడ్డి, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి హన్మండ్లు, సెస్ మాజీ డైరెక్టర్ మల్లారెడ్డిలు హాజరై పూజలు నిర్వహించారు. పదిరలోని సెస్ మాజీ డైరెక్టర్ మల్లారెడ్డి-సుమలత దంపతులు అన్నదానం చేశారు. నర్సయ్య, లక్ష్మారెడ్డి, రాంరెడ్డి, శ్రీనివాస్, గంగయ్య, పర్శరాములు, దేవయ్య, రాజయ్య, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

కోర్టు ఉత్తర్వులు ధిక్కరించే విధంగా అధికారుల తీరు

- కొలతల సేకరణ నిలిపివేయాలని ఇళ్ల యజమానుల డిమాండ్

వేములవాడ, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : వేములవాడ పట్టణంలోని మెయిన్ రోడ్డు విస్తరణ వ్యవహారంలో కోర్టు ఉత్తర్వులను దిక్కరించే విధంగా అధికారులు వ్యవహరిస్తున్నారని ఇండ్ల యజమానులు ఆరోపించారు. పట్టణంలోని మెయిన్ రోడ్డుకు ఇరువైపుల గల ఇండ్ల యజమానులు శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ ప్రధాన రహదారి విస్తరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం జారీచేసిన గెజిట్ నోటిఫికేషన్‌ను సవాల్ చేస్తూ హైకోర్టును ఆశ్రయించామని, హైకోర్టు స్టే ఇచ్చినప్పటికీ ప్రభుత్వ అధికారులు కోర్టు ఉత్తర్వులను ధిక్కరిస్తూ పనులు కొనసాగిస్తున్నారని, కొలతల సేకరణ వంటి పనులు కొనసాగిస్తున్నారన్నారు. రెండు మాసాల పాటు ఎలాంటి పనులు చేయవద్దని మరోసారి హైకోర్టు ఉత్తర్వులు జారీచేసిందని, అయినప్పటికీ అధికారులు హైకోర్టు ఉత్తర్వులను ధిక్కరించే విధంగా వ్యవహరిస్తున్న తీరుపై తాము మరోసారి హైకోర్టును ఆశ్రయిస్తామని వారు తెలిపారు. నేరెళ్ల తిరుమల్ గౌడ్, బొడ్ల అశోక్, ప్రసాద్, కొమ్మ శంకర్, కొమ్మ ప్రకాశం, యాద సత్యదీప్, పోలాస రాజేశ్వర్, కంకణాల క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

'స్థానిక' ఎన్నికలకు సిద్ధం కావాలి

చందుర్తి, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలకు కార్యకర్తలు సంసిద్ధులు కావాలని బీజేపీ మండల ప్రధానకార్యదర్శి పేరుక గంగరాజు అన్నారు. చందుర్తి మండల రామారావుపల్లె గ్రామంలో గావ్ చలో-బస్తీ చలో కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాన్ని శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోదీ సర్కార్ చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగరవేయాలని, పక్క ప్రణాళిక సిద్ధం చేసుకోవాలన్నారు. మండల ఉపాధ్యక్షులు ఎల్లాల తిరుపతిరెడ్డి, నాయకులు ఆది రవీందర్, రాకేష్, దేవయ్య, తిరుపతి, కార్యకర్తలు పాల్గొన్నారు.